## 'సందేశమాల' ప్రచురణములు

| | |
|---|---|
| సఫలత (Success) | రు 2-0-0 |
| ఆదర్శ విద్యార్థి<br>బుకర్-టి-వాషింగ్టను | రు 1-0-0 |
| భారతీయ ప్రతిభ | రు 2-0-0 |
| కులలక్ష్మి, ప్రథమభాగము | రు 1-0-0 |
| కులలక్ష్మి, ద్వితీయభాగము | రు 1-0-0 |
| వీరకాంతలు, ప్రథమ ,, | రు 1-0-0 |

### — రామాయణ సుధాలహరి —

| | |
|---|---|
| బాల కాండము | రు 2-0-0 |
| అయోధ్యా కాండము | రు 2-0-0 |
| అరణ్య కాండము | రు 2-0-0 |
| కిష్కింధా కాండము | రు 2-0-0 |
| సుందర కాండము | రు 2.0-0 |
| యుద్ధ కాండము | రు 2-0-0 |
| ఉత్తర కాండము | రు 2-0-0 |

ప్రతులకు:
'సందేశమాల', తెనాలి.

సందేశమాల

పదునాల్గవ గ్రంథము

# వేదామృతము

రచయిత :

శ్రీ కల్లూరి చంద్రమౌళి, బి. యస్ సి., (ఎబర్డిన)



సంపాదకులు :

సందేశమాల - తెనాలి

స్వామ్యములు :
సంపాదకులవి

ప్రథమ
ముద్రణము

విజయ - భాద్రపదము
1—10—1953

మూల్యము :
రు 1-8-0
Rs 1.50

భారతీ ప్రెస్,
తెనాలి.



కీ. శే. కల్లూరి కాంతయ్యగారు

ఉదార హృదయులు

దానశీలురు

సరళస్వభావులు

భగవద్భక్తులు

అస్మదగ్రజులు

కీ. శే. శ్రీ కల్లూరి కాంతయ్యగారి

దివ్య స్మృతికి

సాశ్రుతర్పణము

# ప రి చ య ము

ఇది నవీనయుగము. శాస్త్ర, సాంకేతిక విజ్ఞానములు విలసిల్లుచున్నకాలము. వీని నలవరచుకొని, సంపదలను సమీకరించుకొననగును. పాశ్చాత్య దేశముల ప్రతిభా జీవిత సౌకర్యముల కివియే ఆయువుపట్టులు. ఇట్టి విజ్ఞాన వికాసతరంగములే పాశ్చాత్యులను ప్రపంచమునందు రాణింప జేసి, వసుంధరాధిపత్యమునకు పట్టముగట్టినవి. సమస్త భౌతిక భోగముల ననుభవింప జేసినవి. జీవిత పరిణామాభివృద్ధిని చేకూర్చి సామ్రాజ్యములను విస్తరింప జేసినవి. కావున నివి వాంఛనీయములు. జీవిత నిర్వహణమునకు ప్రధానములు. అందునను, పరదాస్యముచే కృంగి, కృశించి, అజ్ఞాన, దారిద్ర్య, అనారోగ్యముల కాలవాలముగనున్న మన మాతృదేశమున కివి యత్యవసరములు. ఆదరణీయములు. తినతిండి, కట్టబట్ట, ఉండనిల్లు లేక నిత్యజీవిత నిర్వహణార్థము, శరీరయాత్రను నిర్విఘ్నముగ సాగించుటకు వలయు సాధనసంపత్తికి దూరమైన భారతి, భౌతిక శాస్త్రములను, సాంకేతిక విజ్ఞానమును అలవరచుకొని, నిజప్రకృతిసంపదను అనుభవ యోగ్యముగ గావించుకొని అనుభవించుట లెస్స. ఆకటి చిచ్చుతో నలమటించు యభాగులకు, ఆధ్యాత్మిక ప్రబోధములను గావించుట కిది యదను గాదనియు,

క్షుద్బాధచే 'అన్నమో రామచంద్రా' యని యలమ టించు నిరంతర పీడిత హైన్య, దైన్యజీవులకు– దైవము, మతము, వేదాంతము, తత్త్వశాస్త్రముల నందింప నాతురతను జూపుట చెవిటివానిముందు శంఖమూదుట వంటిదనియు అనవచ్చును.

కాబట్టి భారతదేశమున నేడు నిత్యజీవితావసరము లను నిండుగ చేకూర్చుకొను కృషిని గావించుట ప్రతి భారతీయుని ప్రథమ కర్తవ్యమే. కాని, కేవలము భౌతిక భోగలాలసాహంకారముతో రాజ్యాధికార విస్తృత తృష్ణతో వర్తకవ్యాపారముల వర్ధిల్లజేయు పేరాసతో తులదూగు పాశ్చాత్యదేశములు, వాస్తవిక శాంతిసుఖ ముల ననుభవించుచున్నవా ? వాటి ననుభవింప నాకాం క్షించు పరదేశవాసుల కడ్డురాకుండ నున్నవా ?

కేవలము ఆర్థికసంపద – ధనార్జనము మానవుని సుఖ వంతునిగ, శాంతిప్రియునిగ సలుపజాలవు. భౌతిక భోగ ములు మానవుని విశాలహృదయునిగ, తృప్తివంతునిగ గావింపజాలవు. ఇవి త్యాగమునకు స్వస్తినిజెప్పి, స్వార్థ మును వర్ధిల్లజేయును. తృప్తిని దూరమొనర్చి తృష్ణను విస్తరింపజేయును. ఆదరణము నావలికి నెట్టి అహంకార మును బెంపొందించును. ఏ కొలదిమందియో కోటీశ్వరు లుగ వెలుగొంది, భౌతిక భోగలాలస జీవితములను గడు పుచు, తక్కిన యసంఖ్యాక జనులకు, నిత్యజీవితావసం

ముల నందింప నిరాకరించు పరిస్థితులను - వాతావరణ మును బెంపొందింతురు. అహంకారము, అధికారప్రమత్తత దోపిడి విధానములు, క్రూరహింసలు మున్నగు దుష్ట చర్యలకు రాచబాటలను నిర్మింతురు. ఇట్టి మానవులు స్వార్థపరులుగ తృష్ణను ప్రబలించుకొని, మానవత్వమును మభ్యపఱచి, పశుతుల్యులుగ ప్రవర్తింతురు. పాశ్చాత్య దేశములందు వికృతాట్టహాసములను గావించుచున్న సామ్రాజ్యతృష్ణ, ధనార్జనదాహము, వర్తకవ్యాపార విస్తరణ, కుత్సిత విధానములు, దారుణ యుద్ధములు మానవులను పీల్చి పిప్పిజేసినవి. కాబట్టి భౌతికాభివృద్ధికిని, ప్రపంచ జీవిత నిర్వహణమునకును భూతానుకంప, ఆదరణ, దయాదాక్షిణ్యములు, నీతిశీలములు, సేవాత్యాగములు, నిష్కామ్యకర్మలు అత్యవసరములు. కొలది మంది త్యాగధనులవలన బెక్కురు శాంతిసుఖముల ననుభవింపజాలుదురు. ఇట్టి మానవత్వమును వికసింపజేయు ఉన్నతాశయములను, సదాచారములను బెంపొందించి, భౌతికముగ సరళజీవితమును, తృప్తిని, శాంతిని ప్రబలించు ప్రబోధములను, వీని ననుష్ఠించుటకు వలయు సాధనములను - అనుభూతికి దెచ్చుకొను విధానములను వేదములు, సంస్కృతసారసత్వము విస్తారముగ ప్రబోధించి, ప్రచారమునకు దేజాలుననుట సత్యదూరము

గాదు. కాబట్టి వేదములందలి, విశాల విశ్వమానవ కళ్యాణము నందించు మహోన్నతభావములు, వానిననుష్ఠించి – అనుభూతికి దెచ్చు విధానములు, మన కర్తవ్యవసరములు, వాంఛనీయములు.

పాడిపంటలు, గృహపరిశ్రమలు, నిత్యజీవితావసరముల సులభముగ నందించు సర్వకృషిని, శాస్త్రసాంకేతిక విజ్ఞానములకు గుణిని గావించి, సకల భౌతిక సంపదల కాలవాలముగను, నీతిని, దానధర్మాది ఉదారగుణములను, హృదయార్ద్రతను గావించునట్టియు, ఉన్నతాశయములను అనుభవానుభూతులకు దెచ్చుకొను క్రమశిక్షణాపూరిత జీవితము నందించునట్టియు మానవుని పరస్పర సహనశీలునిగ, అన్యోన్యానురాగ సహకారిగ గావించి, పరిపూర్ణ వికాసమును, బ్రహ్మానుభూతిని అందించు విజ్ఞాన ప్రబోధమును గావించునట్టియు విద్యావిధానము భారతదేశమునకు నేడెంతయును వాంఛనీయము. దీని నందించుటకు, వేదములు, సంస్కృత సారస్వతము విరివిగ తోడ్పడునని మా విశ్వాసము.

ధర్మమును, బ్రహ్మమును ప్రబోధించి, అనుభూతికి దెచ్చు విజ్ఞానము వేదము. ధర్మము సర్వ విశ్వమును సంరక్షించి కాపాడును. మానవుని ఉన్నతశ్రేయమునకు

గొంపోవును. సర్వమును ధర్మమునందే అధిష్ఠింపబడి యున్నది. ప్రకృతియందలి ఋతమును, మానవునికి వలయు క్రమజీవితమును ధర్మాధారములే. బ్రహ్మము నిత్యానందమును, అమర జీవితమును అందించును.

ప్రాచీన,నవీనములను, ప్రాక్పశ్చిమములను పర్యాలోకన మొనర్చి, సమీకరించి, విశ్వకళ్యాణార్థము సుస్థిరశాంతి సాధమునకు పునాదులు వేయుట వివేకసంపన్నుల విలక్షణము – విధి. విశాలదృక్పథముతో, సద్భావ బీజములను మానవ మానసక్షేత్రములందు పాదుకొలిపి, సుగంధ విదళిత సుకుమార సుందర కుసుమములను, మధుర రసమయఫలములను సమస్త జీవరాసుల కందించు పవిత్ర విశాల హృత్కమలములను వికసింప జేసినదే తడవుగ, ప్రేయశ్శ్రేయములు, ఇహపరములు కరతలామలకము లగును. అంతఃకరణము నుండి పవిత్రభావము కుసుమములను బాహ్యమున కావిర్భవింప జేయు వినిర్మల బుద్ధి వికాసమును, దానిని నిత్యాచరణ యోగ్యముగ గావించి, అనుభూతి నందించు పవిత్రహృదయ వికాసమును వేదములయందు మాత్రమే గాంతుము. వేదములు మానవుని సర్వతోముఖాభివృద్ధికి దోహదము నొసగుచు, పరిపూర్ణవికాసమును ఆనందమును అందించు బ్రహ్మమును సాక్షాత్కరించుకొనుటకు దోడ్పడు పరమ

సాధనములు. కాబట్టి వేదాధ్యయనము, సంస్కృతసార స్వత శిక్షణము సర్వమానవులకు సమముగ జెందిన స్వత్వము. అవి యే యొక వ్యక్తికిగాని, జాతికిగాని ప్రత్యేకముగ జెందిన సొత్తుగాదు. మానవులకందరకును జెందిన సమష్టిసంపద. వేదములందలి పారమార్థిక సత్య ములు సర్వవ్యాప్తములు, సహజములు, సరళములు, సులభానుష్ఠానయోగ్యములు. కాని, అపవ్యాఖ్యానము లను గావించు అల్పజ్ఞులును, త్రయీధర్మమును విశ్వ వ్యాప్తమొనర్పక, రహస్యాతి రహస్యముగ మరుగు పఱచుచు, సంకుచిత స్వార్థమును ఘనీభవింప జేసికొనిన పండితులును, భారత జనయిత్రికి కడుపుచేటుపంట. అల్పజ్ఞుల అపవ్యాఖ్యానములకు, ప్రాజ్ఞుల స్వార్థబుద్ధికి గురియై మరుగుపడిన వేదజనని, నిజతేజోదీధితులనువిశాల, విశ్వమున వెలార్ప నశక్తురాలైనది. తత్ఫలితముగ జాతి జీవితమునం దజ్ఞానాంధకార మావరించినది. తత్పరి ణామములే బానిసత్వము, పరాపేక్షబుద్ధి, భౌతికాధ్యా త్మిక పతనము. స్వయంకృతాపరాధము కట్టి కుడుపక మానునా! ఇట్టి వీరిని గని, వేదనము ననుభవించు వేద కన్య కన్నీటిధారలు భారతి సంతానమును క్షుద్బాధ లకు దాస్య బంధనములకు గుఱిని గావించినవి. ఈ బాధలను వైదొలగించి - పాడిపంటలను - సర్వసంపద

లను చేకూర్చు అన్నపూర్ణ, బ్రహ్మానుభూతి నందించు బ్రహ్మవాదిని (సరస్వతి) యవతరణ మవసరము. వేద పునరుద్ధరణ మిద్దానిని ప్రసాదించును. వేదములు ప్రకృతి నిజస్వభావమును విస్పష్టముగ వివరించును. ప్రకృతి యందు లీనమై తదతీతముగ వెలుగొందు బ్రహ్మమును ప్రబోధించును. వేద గర్భిత అగాధాలోచనాబీజములు, ప్రచండతేజఃపుంజప్రార్థనానినాదములు, పవిత్ర భావ తరంగపరంపరలు, ఉత్కృష్ట విశాలాదర్శములు, పరస్పర సహకార సహానప్రబోధసుందరదృశ్యములు, ఆద్యంత రహిత నిత్యసత్యధర్మముల బీజాంకురములు, అఖండ సచ్చిదానంద జ్యోతిగ ప్రకాశించుచుండును.

భారతీయులమగు మనము ధనార్జనమును గావింప వలసినదే. సంపదల సమృద్ధిగ సంగ్రహింపవలసినదే. జ్ఞాన జ్యోతిని ప్రదీపించు అపార పాండిత్యము నలవరచుకొన వలసినదే. వీని నార్జించు కృషికి గడంగువారు ప్రశంస నీయులే. కాని పరుల కొల్లగొట్టి కూటనీతితో ధనార్జన మును గావింప జనదు. న్యాయపథమున, నీతిమార్గమున ధనము నార్జించుచు, అట్లార్జించిన దానిని లుబ్ధుని భంగి కూడబెట్టక, స్వార్థమునకే మితిమీరి మెక్కక, ఉదార బుద్ధితో- దాతలుగ-సేవాతత్పరులుగ చెలువొందుడనియే మా ప్రబోధము. విజ్ఞానమును యేకొలదిమంది హస్త

గతమో గావించి, వారి ప్రత్యేకసొత్తుగనొనర్చు సంకుచిత విధానమునకు స్వస్తినిజెప్పి, విశాలభావ సంపన్నులుగ నద్దానిని విరివిగ – ఉచితముగ సర్వమానవుల కందించు త్యాగమూర్తులుగ విలసిల్లుడనియే మా యభిలషితము. ఉదారబుద్ధితో–పవిత్ర హృదయములతో, నిర్మల ఉన్నతాశయ సరళ జీవితముల నలవరచుకొనుడనియే భారతి సదా ప్రబోధించుచున్నది. ఇట్టివారు భారతి కడుపు పంటగ వెలుగొందిననాడే, మనమును – సర్వమానవులును సహన సఖ్యములతో–శాంతి సుఖములతో జీవితయాత్రను సాగించుచు లోక సంగ్రహమును, ఇహపరానందములను బడయుట తథ్యము.

భారతదేశము ఆధ్యాత్మిక తత్త్వమును, భౌతికశాస్త్ర సాంకేతిక విజ్ఞానమును సమ్యక్ సమీక్ష నొనర్చి సకల భౌతికాధ్యాత్మిక సంపదల చేకూర్చుకొని, జాతికి నూతనోత్తేజము నందించి, విశ్వకళ్యాణమునకు, శాంతివాయువులను బ్రసరింపజేసి, తన పూర్వ గౌరవ ప్రతిష్ఠలను పొందనగును. అందులకు వేదాధ్యయనము, సంస్కృత సాహిత్య సమ్యక్ సమీక్ష లత్యవసరములు.

విభావానుభావ సాత్త్వికముల సమ్యక్సమీకరణము స్థాయియై రసానుభూతి నందించినట్లు సప్తస్వరములు ఆరోహణావరోహణా క్రమపరివేష్టితములై సంగీతము

నకు స్థాయిని చేకూర్చినట్లు, ఆధ్యాత్మిక విజ్ఞాన, భౌతిక శాస్త్రముల సక్రమ సమ్మేళనము ఆనందమయ జీవితమును, శాంతిమయవిశ్వమును సృష్టించగలదు. ఇదియే మా ప్రగాఢ విశ్వాసము. సహృదయు లీ దృష్టితో నీ గ్రంథమును సమీక్షింతురుగాక !

తెనాలి
1-10-53

కల్లూరి చంద్రమౌళి

ఓమ్

# వేదామృతము

## వేదకాలము

"వేదములు సనాతనములు. నిత్యములు. అపౌరుషేయములు. అవి మానవకృతములు గావు. సురవిరచితములును గావు. భగవంతునితో తమ నిత్యస్థాయిని గలిగిన భగవద్వాక్కులు. 'యస్య నిశ్వాసితం వేదాః' వేదములు భగవంతుని నిశ్వాసితములు." అని యుగయుగములుగ భారతీయార్యులు విశ్వసించుచున్నారు. "వేదమూలముననే నన్నెఱుగగలరు. వేదములను నేనే యెఱుగుదును." అని కృష్ణభగవానుడు వచించెను. "వేదైశ్చ సర్వై రహమేవ వేద్యో వేదాంతకృత్ వేదవిదేవచాహమ్." కాబట్టి వేదములు భగవంతునితో తమ నిత్యస్థాయిని గలిగి యున్నవని విస్పష్టము.

ఇతర మతగ్రంథములనుగూర్చి పైన చేర్కొనిన విధముగ ప్రవచింపబడలేదు. బైబిలు, ఖురాను, త్రిపిటకములు జెందుఅవెస్తా మున్నగు యితర మతగ్రంథములకు కర్తలు మానవులు. అవి కాలబద్ధములు. ఆ మత

గ్రంథముల కర్తలు మహాత్ములు. అవతారపురుషులు. అయినను మానవజన్మ ధారులు. సర్వమతగ్రంథములును వేదానంతరము వెలువడినవే యనుట నేటికిని నిర్వివాదాంశము. వేదముల జనన మగ్రాహ్యము. యుగయుగములుగ-వంశానుగతముగ, భారతమాత - వాగ్ద్వారమున తన సంతతికి - సర్వవిశ్వమునకు యీ దివ్యసంపద నందించుచునే యున్నది.

వేదములకు - సంహితలకు ఋషులు కర్తలుగారు. ద్రష్టలు మాత్రమే. ఋషులు యీ వేదఋక్కులను అనుభూతికి దెచ్చుకొని, ఆవిష్కరించి క్రమముగ తమ సంతతి కందించిరి. తరతరములుగ - వంశానుగతముగ వేదములను వినిపించుటచే - వినబడినని గావున శ్రుతు లని గీర్తింపబడెను. నవీనకాలమున, భౌతిక శాస్త్రవేత్తలు, చారిత్రక పరిశోధకులు, తార్కికులు మున్నగు కొందఱు, వేదముల నిత్యత్వమును, అపౌరుషేయత్వమును అంగీకరింపక, వేదకాలమును నిర్ణయింప పరిశీలనములను, పరిశోధనములను గావింప గడంగిరి. ఇట్టి పరిశోధనములను గావింప సమకట్టిన, పాశ్చాత్య విజ్ఞానవేత్తలలో ప్రముఖుడు - ప్రధానుడు మ్యాక్సు ముల్లరు.

చంద్రగుప్తుని జననకాలము నాధారముగ నిడికొని బుద్ధునకు పూర్వమే వేదములు గలవనియు, క్రీ. పూ. 500

6 సం.ల నాటివేనవి వాదించు ప్రబుద్ధులును బయలు దేరవచ్చును.

వేదఘట్టముల అంతరమున ప్రతి వేదమునకును 200 సం.ల వ్యవధిగలదని భావించిన డాక్టరు, వింటర్నిట్జు (Dr. Winternitz) తదుపరి తన యీభావము ప్రమాద కర మనియు, నిరాధారమనియు గ్రహించి దాని నుపసంహరించుకొనెను.

శ్రీ అవినాశచంద్రదాసును, వింటర్నిట్జుగారి ప్రథమ భావమును తిరస్కరించుచు "1,500 సం.లు, అంత కెక్కువ కాలము అంతరము గలదని వాదించువారిని కాదనుట కాధారములేమి?" యని సూటిగ ప్రశ్నించెను.

వేదభాష నిర్మాణమునందు – లిపియందు యుగయుగ ములుగ నెట్టి మార్పును గాంచజాలము. వేదములను గానమొనర్చుటకు కఠినములు, క్లిష్టములు నగు నియమ ములను, పద్ధతులను కట్టుబాట్లను గావించి, యెట్టి మార్పునకును గురిగానివిధముగ బంధించిరి. వేదములు "ఎప్పు, డెట్లు, యెవరిచే గానమొనర్పబడినవి" అను విషయమునందే వాటిప్రత్యేక విశిష్టత గలదు. వేదము లను గానమొనర్చుటకు యేర్పరచిన 'క్రమ, జటా, ఘన, పద' అను నియమములును, అక్షరములును చెక్కు చెదరక సంరక్షింపబడినవి. వీని నుచ్చరించు క్రమవిధాన మును వేదములందే పొందుపరచబడెను. వేదబుక్కుల

యుచ్చారణమును (రసనదంత, కంఠాది) వేనినుండి యుచ్చరింపవలె నను విషయములు విస్పష్టముగ నందే బేర్కొనబడెను. ప్రతియక్షరము నుచ్చరించు ధ్వని కాలము, ఒక యక్షరమునకు నింకొకయక్షరమునకు గల అంతరము (వ్యవధి) ఒక పదమునకు - మరియొక పద మునకు గల యుచ్చారణాంతరము క్రమముగ - విస్పష్ట ముగ - సుస్థిరముగ నిర్ణయింపబడియున్నది. ఇట్లు, వేద భాష నించుకయైనను జిహ్వా - దంత - కంఠ - కంఠోష్ఠ్య నాసికా దంతోష్ఠ్యాదులలో మార్పునకు గుఱిగానీయక, సక్రమములగు కట్టుబాటులతో, సుశిక్షణముతో పోషించి సంరక్షింపబడెను. వేదభాషకుగల ప్రత్యేక, ప్రశస్త విలక్షణ మదియే. ఇట్టి కారణములచేతనే, విశ్వ భాషలకు అన్నిటికిని - పరిశిష్ట భాషలయందును మాతృ భాషగ, వేదభాష వెలుగొందెను. అందులకే దీనిని మానవభాష యని పిలువక దేవభాష యని కీర్తించిరి. మతగ్రంథముల యందును, ఒక్క శతాబ్దిలోపలనే, పదములు, వ్యాకరణ సూత్రములు మార్పులను జెందెను. క్రొంగ్రొత్త పదములను జేర్చుటయు వినూత్న వ్యాకరణసూత్రములను గూర్చుటయు తటస్థించెను. కాని, కాలమెంతగ గతించినను, వేదబుక్కులు (సంహి తలు) మాత్రము, హిమాలయములవలె సుస్థిరములుగ, గంభీరములుగ నిలచియే యున్నవి. కాబట్టి భాషావివ

ర్యాసమునుబట్టి వేదకాలనిర్ణయమును గావింప బూను టయు నసంభవము; దుర్లభము. ఇంతియేగాదు, మరి యే ప్రమాణముల – సాధనముల నాధారముగ, నూతగ నిడి కొనియైనను, వేదకాల నిర్ణయమును గావింపజాలము. పైన వివరించిన ఖగోళ, భూగోళ, భూగర్భ, ప్రాచీన శిథిల వస్తు పరిశోధనములచేతగాని, శాస్త్ర చారిత్రక సిద్ధాంతముల ననుసరించిగాని, వేదములందు గల యంతఃకరాధారములని భావింపబడిన విషయముల ననుసరించిగాని, వేదకాలమును గూర్చిన యొక సుస్థిరనిర్ణ యమును గావింపజాలక, పరస్పర వైరుధ్యములగు భిన్న విభిన్ననిర్ణయములను, సిద్ధాంతములను భ్రమలపై–ఊహా జనితపు పునాదులపై నిర్ణయింపబూను సర్వప్రయత్నము లును విఫలములగును. ఎవరి బుద్ధికి తోచినరీతిని వారు నిర్ణయములను గావింపదొడంగిరి. 'ఊహాజనితములగు నిట్టి పాక్షిక నిర్ణయములు వాదోపవాదములకు, మానసిక విలాసమునకు దోడ్పడవచ్చునేమోగాని నిత్యసత్యమును బ్రకటించు అనంతనియమములు మాత్రము గాజాలవు. క్రీ. పూ. 500 సం.ల నుండి 80,000 సం.ల వరకు వేద కాల నిర్ణయమునకు గడంగిన యీ శాస్త్రకారులయు, చరిత్ర పరిశోధకులయు నిర్ణయములే దీనికి ప్రబలాధార ములుగ, ప్రశ్నింపరాని సాక్ష్యమునొసగుచున్నవి. తమకు లభించిన యల్పాంశముల నాధారములుగ గైకొని,

విజ్ఞానవేత్తలు, తమకెంత నిష్పాక్షిక దృక్పథము గలదని భావించినను, తమ నిర్ణయములు దీర్ఘపరిశ్రమ పరిశీలనముల ఫలితములే యని విశ్వసించినను అవి సంశయాస్పదములుగ, పాక్షిక సత్యములుగ, పూర్ణాధారములులేని వివాదాస్పదములుగనే విలసిల్లుచున్నవి.

కాబట్టి వేదముల జననకాలమునుగాని, అవి పూర్తిగావింపబడినవని దలంచు చివరికాలమునుగాని, యే దృక్పథమున గాంచినను పూర్ణముగ నిర్ణయింపజాలమని సత్యాన్వేషులు, సత్యమార్గానుచరులు సమ్మతింపక తప్పదని నుడువనగును.

"వేదములు క్రీ. పూ. 600 సం.ల క్రితము సంగ్రథింపబడినవి" అని కొందరివాదము. దీని నామోదించుదమనినను "అంతకు పూర్వ మెవరిచే, యెట్లు, యెప్పుడు రచింపబడినవి" అను విషయనిర్ణయమును గావింపజాలకుంటిమి. వేదకాలనిర్ణయమును గావింపబూను మానవుడల్పజ్ఞుడు; స్వల్పుడు; ఇట్టివాని మనస్సున కందని విషయముగనే యిది వెలుగొందుచున్నది. ప్రాజ్ఞులు పెక్కండ్రు, వేదకాల నిర్ణయములకు గడంగి విఫలులైరి. కావున "వేదములు భగవంతునితో తమయునికిని గలిగియున్నవి. అవి యపౌరుషేయములు, అనంత సత్యానిలయములు." అని విశ్వసించుటయే సమంజసము. వేదములే భగవంతుని,

మానవున కావిష్కరించును; ప్రత్యక్షమొనర్చును. ఈ నిత్యసత్యమున కాధారములను గాంచుడు !

1. మానవుడు నిత్యవిజ్ఞానాన్వేషి. జీవజాలమునుండి, మానవుని వేరుపరచునది యీ విజ్ఞానతృష్ణయే. అయితే ఒక విషయమును పరిశోధించి, పరాకాష్ఠ నొందిన విజ్ఞాని, తనకు పూర్వ మా విషయములేదని చెప్పనొప్పదు. ఎట్లన ? భూభ్రమణము, ఆదిత్యాచలనము, సృష్ట్యాది నుండియు జగమెరిగిన సత్యము. అయినను భూతత్వ శాస్త్ర పరిశోధనాపరులు భూమ్యాకర్షణను కనుగొన్న మాత్రమున, ఇతఃపూర్వము భూమ్యాకర్షణ లేదని చెప్ప నొప్పదు. ప్రకృతవిషయము - అనగా భౌతికశాస్త్ర పరి జ్ఞానము మనోబద్ధము, మానసిక పరిశీలనకు అందు బాటులో నుండునట్టిది. మనోవిజ్ఞానజన్యములగు భౌతిక విషయములనే శాస్త్రజ్ఞులు నమ్ముచుండగా, మనస్సునకు అందని వేదవిజ్ఞానమును గూర్చి గాని, వేదముల అనంత త్వమును గూర్చి గాని మనము శంకింప నవసరములేదు. మనఃకాలవిషయాతీతములని శాస్త్రజ్ఞులు తద్గతవిశేష విషయములను తెలుసుకొన్నంత మాత్రమున భూమికి తజ్జన్మకు ఎట్లు కర్తలుగారో, అటులనే వేదములను ప్రబోధించినవారుగాని, ప్రమాణించినవారుగాని వేద ములకు కర్తలు కాజాలరు; కాగా, వేదధర్మమును ఆవిష్కరించిన వారగుదురు.

ప్రకృతి, ఋతము. భౌతికశాస్త్రము మనోబద్ధము. కాని బ్రహ్మవిజ్ఞానము మనస్సున కతీతము. వేదము అట్టి బ్రహ్మవిజ్ఞానము. కావున నది నిత్యము. "నిత్యో నిత్యానాం."

ఉ. 1. ప్రాసాదాధిరోహణమునకు నిచ్చెన సాధనము. బ్రహ్మానుభూతికి మనస్సు ఉపకరణము. ప్రాసాదము నెక్కుటకు స్థిరము, నిశ్చలము అయిన నిచ్చెన నూతగ గొని హర్మ్యారోహణానంతరము నిచ్చెనను విసర్జించినట్లు ఏకాగ్రమగు మనస్సును సాధనముగ నిడికొని బ్రహ్మానుభూతిని బడసినదే తడవుగ మనస్సుతో పనియుండదు. అందువల్ల మనస్సు పరిమితమగు భౌతికము, నశ్వరము. వేదము బ్రహ్మజ్ఞానము. కావున నిత్యము.

2. వేదము జన్యముగాదు. జన్యము పరిచ్ఛిన్నము, దేశకాల నిమిత్తములకు కట్టుబడును. వేదవిజ్ఞానము—పరిపూర్ణము. దేశకాలముల కతీతము. కాబట్టి, సత్యము; నిత్యము.

3. వేదములు భగవన్నిశ్వాసములు. సృష్టికర్త యగు బ్రహ్మనుండి అవతారపురుషులు, ఋషులు, తాపసాదులు అందరును వేదములను ఆవిష్కరించిన వారే. వాటికి కర్తలు మాత్రముగారు. వీరు ఆప్తులు. ఆప్తులెంతటి మహాత్ములైనను, అవతారపురుషులైనను మానవాంశ సంభూతులుగ నున్నంతదనుక అప్రతిపత్తి (అజ్ఞానము) చే

గాని, అన్యథా ప్రతిపత్తిచేగాని (పొరపాటు) ప్రమాద మునకు గురికావచ్చును. కాని వేదవిజ్ఞాన మట్టిదిగాదు. అది భగవంతుని నిశ్వాసము గావున భగవంతునివలె నిత్యము, సత్యము, అపౌరుషేయము. బ్రహ్మ తనసృష్టిని వేదములనుండియే గావించెను." "యోవేదేభ్యో అఖిలం జగత్ నిర్మమే."

4. ఏ విషయనిర్ణయమున కయినను అంత్యప్రమాణ మవసరము. విషయప్రాముఖ్యమునుబట్టి ప్రమాణ ప్రమేయము నిర్ణయింతురు. జగన్నిర్మాత యగు భగ వంతుని గుర్తించుకొనుటకు ఆధారము వేదములు. అందు వల్లనే వేదములు స్వయం ప్రకాశములు. స్వప్రమాణ ములు. ప్రభుసమ్మితములు.

ఉ. మానవప్రపంచమున రాజాజ్ఞ, అంత్యనిర్ణయము. దీనిని ప్రశ్నింపవీలులేదు. శిరసావహించి అక్షరతః అమలు జరుపవలెను. భౌతికప్రపంచమునకు రాజాజ్ఞ యెట్లో బ్రహ్మవిజ్ఞానమునకు వేదవిధి అట్లు.

5. యజమానిగాని, వారసుగాని లేని ఆస్తి ప్రభు త్వాధీనమయినట్లు, ఆధ్యాత్మిక విజ్ఞానమయి యగు వేద విజ్ఞాన జ్యోతికి కర్త ఎవరో తెలియనప్పుడు తద్వేద జ్ఞానమంతయు భగవదధీనమే. కాని, భగవంతుడు కర్త మాత్రము కాదు.

6. వేదవిజ్ఞానము సర్వమును సమీకరించి సమన్వ యించి, ఏకభగవానుని సాక్షాత్కరింపజేయును. అందు వల్లనే వేదచోదిత ధర్మమున "ఏకమేవా ద్వితీయం బ్రహ్మ" అనిరి. ఏకత్వమున ద్వైత్వమునకు తావెక్కడిది ? సాదృశ్యమున కవకాశ మేది ?

వేదము లన గ్రంథములు గావు. గ్రంథములకు ఆద్యం తము లున్నవి. ఋషులు మంత్ర ద్రష్టలై, వేదధర్మములను గ్రంథస్థ మొనర్చిరి. కనుకనే యా గ్రంథములను వేదము లనిరి. ధర్మమునుబట్టి వీటికా నామమేర్పడినదిగాని, గ్రంథమునుబట్టి మాత్రము వేదనామము రాలేదు.

కాబట్టి వేదముల కాలనిర్ణయమును నిర్ణయింప బ్రయత్నములను గావించిన పాశ్చాత్యపరిశోధకులు, వారి యనుయాయులగు భారతీయులు ఉష్ణమును జనింప జేసిరేగాని, అజ్ఞాన తిమిరాంధకారమును బారద్రోలు వెలుగు నొసగజాలకపోయిరి. వేదములు కాలబద్ధములు గాని, మానవనిర్మితములుగాని కావు. అవి నిత్యములు, అపౌరుషేయములు. భగవంతుని నిశ్వాసితములు.

వేదముల యీ దివ్యసత్యము, భారతీయ సంస్కృతి నాగరికతల కతిప్రాచీనతను జేకూర్చి, యనంతత్వమును, యవిచ్ఛిన్నతను బ్రసాదించెను.

పురాతన రోము, గ్రీకు, బ్యాబిలోనియా, మెక్సికో, ఈజిప్టు మున్నగు దేశముల నాగరికతలు మఖలోపుట్టి

పుట్టలో నంతరించినవి. మన స్మృతిపథమున నుండక నశించినవి. కాని వేదముల చైతన్యము- ప్రాణశక్తి నిత్యత్వమును, అమరత్వమును గలది. కాబట్టియే మన సంస్కృతి, నాగరికతలకు సుగంధకోమల కుసుమములను, మధురఫలములను నొసగుచునే యున్నవి. తదితరదేశ ములకన్నిటికిని - సర్వప్రపంచమునకు, ఆర్యావర్త మొకధృవతారయై దివ్యజ్యోతిగ బ్రకాశించుచు, శాంతి దూతగ వెలుగొందుచున్నది. నిత్యములు - అనంతములు నగు వేదము లున్నంతకాలమును సనాతనధర్మము (హిందూమతము), భారతదేశము, జీవించియే యుండును తన విజ్ఞానవికాసవీచికల దివ్యతేజోసందేశమును ప్రపంచ మున కందించుచునే యుండును. కావున వేదవిజ్ఞాన సంస్కృతులను పుష్టివంతములుగ గావించి, దేదీప్యమాన ముగ బ్రకాశింపజేయుటయందే భారతీయులమగు మన ప్రథమకర్తవ్యము గలదు. ఇదియే మన ప్రధానధర్మము. ఒక్క భారతీయులకేగాదు, విశ్వమానవసంతతికిని నిదియే కనీసధర్మము. విశాలవిస్తృత వసుంధరను వివరముగ నెఱిం గిన శాస్త్రజ్ఞులు ఆ భూమికి సృష్టికర్తలు గారుగదా ? ఈ కర్తవ్యపాలనమునందే మన జీవితాభివృద్ధి వికాసము, ఇహాపరసుఖములు, శాంతి గలవు. మానవునకు భుక్తి ముక్తులను బ్రసాదించు రాచబాట యిదియే. ఇట్టి మహో త్తర దివ్యశక్తిని బ్రసాదించు వేదములను తృణీకరించి,

వాటి ప్రభావమును సన్నగిలజేసిననాడు, భారతీయులే గాదు, సర్వప్రపంచమును ప్రళయము నందును.

కాబట్టి నేటి స్వతంత్రభారతి విశాలాభివృద్ధికి, తద్వికాసమునకు వేదములు దృఢతరమగు పునాదులుగ నుండ నగును. వేదసంస్కృతి నాగరికతలపైననే భావిభారత నిర్మాణమును గావింపవలెను. మన స్వార్థదృష్టితోగాని, విశ్వకళ్యాణ విశాలదృష్టితోగాని, వేదములను, వాటి సంస్కృతి నాగరికతలను పుష్టివంతముగ పోషించి సంరక్షింపవలెను. అప్పుడే సత్ఫలితములు సమకూడును.

వేదములు నిత్యసత్యములు. కాబట్టి వాటితో మనకు గల సంబంధమును, కొలికిని త్రెంపివైచిన మనమే నశింతుము. వేదములు మాత్రము నిత్యసత్యములుగనే వెలుగొందుచు, వాటిని ఆవిష్కరించి, కీర్తించు ఋషుల కొఱకు స్థిరముగ నిలిచియే యుండును.

వేదములను లిపితోగూడిన వ్రాతమూలముననే సంరక్షింపజాలము. గ్రంథస్థములుగ ముద్రణమును బడసినంతనే, నవి కాపాడబడినవని భావించుట ప్రమాదము. క్రమశిక్షణముతో – సక్రమ విధానమున, సవ్యముగ గానమొనర్చుటయందే వాటిరక్షణముగలదు. వేదఋక్కులను సామాన్యగ్రంథములవలె పఠింపకుడు. నిర్ణీత సూత్రములకు గుఱిగావించి, గానమొనర్పవలెను. వేద

ఋక్కుల సహజత, ప్రత్యేకవిశిష్టత, వాటిని శ్రావ్యముగ గాన మొనర్చుటయందే గలదు.

నవీనకాలమున, పూర్వాచారపరాయణు లనబడు, ప్రాచీన సాంప్రదాయానుయాయులగు యేకొలదిమందియో వేదములను సక్రమముగ గాన మొనర్చుచున్నారు. మన దుస్థితిసూచకమో యన నిట్టివారి సంఖ్యయు క్రమముగ క్షీణించుచున్నది. మిగిలిన కొలదిమందియు, తమ దారిద్ర్యముచేతనో, నవీన నాగరికతా వ్యామోహమునకు లోనగుటచేతనో, ప్రజల ఆదరాభిమానములు అంతరించుటచేతనో, మరి యితరకారణములచేతనో, యీ వేద గానమును విడచిపుచ్చుచో, మనమును, మన సంస్కృతి నాగరికతలును నేలకుగూలి నశించును. కాబట్టి జాతీయ ప్రభుత్వములు, హైందవ మతసంస్థలు, సంఘాభిమానులెల్లరును, యిట్టి వేదగానపరాయణుల నన్నివిధముల నాదరించి, సత్కరించి, వేదములను, సంస్కృతినాగరికతలను నిలువబెట్టు నిరంతరకృషిని గావింపనగును; అట్టివారియెడ నిరంతర భక్తిశ్రద్ధలను బ్రదర్శింపవలెను. "మత ప్రసక్తిమాకు లేదు. మన ప్రభుత్వము మతప్రమేయరహితసంస్థ" అను సంకుచిత, దుర్బలవాదమును లేవనెత్తి యనాదరణ భావమును వేదములయెడ యందలి సంస్కృతియెడ బ్రదర్శించుట కౌరవితో తలగోకుకొను

టయే. వేదములు, వేదభాష, మన కాయువుపట్టులు, జీవగఱ్ఱలు.

కన్యాకుమారినుండి- కాశ్మీరములవరకు- 'ఆసేతు హిమాచలపర్యంతము' భారతీయులమగు మనమైక్యతకు, ప్రత్యేకవిలక్షణమును జేకూర్చు సంస్కృతి నాగరికతలకు దోహదమునొసగి సహన, సమానతల నందించుచున్నవి వేదములే. నేటికిని- భావికాలమునకును అవియే మన సంస్కృతి వికాసదాతలు. శ్రీ శంకరాచార్యులు ఆసేతుహిమవత్ పర్యంతమును మఠ్మరములను స్థాపించెను. ఆర్యావర్త మేకదేశ మేనని దశదిశల జాటెను."భారతీయులేకజాతీయులు, ఒకే సంస్కృతికి జెందినవారు" అని ఘంటాపథముగ నెలుగెత్తి గీర్తించుచు తన జీవితమును ధన్యమొనర్చుకొని, దేశమును తరింపజేసెను. తాను ముక్తుడై భారతి కమరత్వము నందించెను. శంకరుని యీ విశాల విశ్వవిజ్ఞాన దృక్పథమును మనదేశ ప్రధానామాత్యులు శ్రీ జవహ్వరిలాలునెహ్రూ కొనియాడెను, నవీన మహాపురుషులెల్లరు గీర్తించిరి. కాబట్టి వేదముల గానమొనర్చుచు నందలి యుత్కృష్టసంస్కృతిని పోషించి, వ్యాప్తమొనర్చుచున్నంతదనుకనే మనము సజీవులముగ వెలుగొంది ప్రపంచమునకు శాంతి, ప్రేమసందేశముల నందీయగలము. సహన,సమతల సర్వత్ర వ్యాప్తమొందించి, విశ్వకళ్యాణమును జేగూర్పజాలుదుము. ఇట్లు

గావింపనిచో మనము నశించి - భారతదేశమును స్మశాన వాటికగ గావింతుము. కాల మను కొల బద్దతో - వేద కాలమును నిర్ణయింపగడంగుట మన యల్పత్వమునే సూచించును. అనంతమును కాలముతో నెట్లు కొలువ గలము ? ఇది యసంభవము. కాని దానికి పూనుకొని, వ్యర్థులమగుటకన్న మనోబద్ధహేతువులతో వాదోప వాదములను గావించుటకన్న, పూర్ణత్వమును సాధించి, నిశ్చలమానసులముగ నుండి నిరంతరానందామృతము నాస్వాదించుట లెస్స. జీవిత పరమావధికి చరమలక్ష్య మిదియే. కావున వేదములందలి నిత్యసత్యములను అధ్య యన మొనర్చి - కీర్తించి వాని ననుభూతికి దెచ్చుకొను కృషికి గడంగుదము. "ద్రష్టవ్యః శ్రోతవ్యః, మంతవ్యః నిదిధ్యాసితవ్యః" ఇట్టి కృషిని గావించుట సముచితము. ఇందే మానవవికాసము, భగవత్సాక్షాత్కారములు గలవు. వేదకాల నిర్ణయమునకు వ్యయపరచిన మానవశ్రమ, కాలములను, వేదగానమునకు, అందలి సత్యానుభూతికి వినియోగించినచో మనము ధన్యుల మయ్యెడివారము. కాబట్టి వేదములను సదా పారాయణమును గావింపుడు. గాన మొనర్పుడు. పరులకు శ్రావ్యముగ వినిపింపుడు. నిత్యము మనన మొనర్చుచు నిశ్చలచిత్తులుగండు. అను భూతిని బడసి, పావనులై బ్రహ్మమును ప్రత్యక్ష మొనర్చుకొనుడు.

"నేనే భగవంతుడను. సర్వాంతర్యామి యగు ఆ పురుషుడను నేనే" అను అంగీరసవంశ జాతుడు, అథర్వుని పుత్రుడు నగు దధీచిమహర్షి సృష్టిని, సృష్టికర్తను ఏకముగ గానమొనర్చుటను గాంచుడు!

# సంస్కృత భాష

మానవుడు వివేకవంతుడు, విజ్ఞానమయుడు, భావ సంపన్నుడు. భావమును బాహ్యప్రకటనము గావించు వాహానము భాష. యుగయుగములుగ మానవవికాసము నకు, పూర్ణాభివృద్ధికి, బ్రహ్మానుభూతికి దోడ్పడు సాధ నము భాషయే. 'విజ్ఞానమునకు మూలము భగవంతుడు. బ్రహ్మమునుండియే విజ్ఞానము వెలువడినది.' అని భార తీయుల నిర్ణయము. బ్రహ్మజ్ఞానము నావిష్కరించునది వేదము. కాబట్టి వేదభాషను దేవభాష యని కీర్తించిరి. లిపిని 'దేవనాగరి' యను నామముతో బేర్కొనిరి. దేవ భాషను లక్ష్యమునం దిడికొని సంస్కరింపబడిన ప్రాకృత భాషయే సంస్కృతమని వ్యవహరింపబడుచున్నది. సంస్కృతభాష సరళము, మధురము, లలితము. పరి పూర్ణతను బడసి ఉన్నతస్థానము నలంకరించినది. ప్రపంచ మునందలి ప్రధానభాషలన్నింటికి మూలముగ - మాతగ వెలుగొందినది' అని విజ్ఞులెల్లరైక్యకంఠముగ నామోదిం చిరి. మన ప్రాంతీయ భాషలకు మాతృదేవిగ విలసిల్లి వాటినిపోషించి, చైతన్యవంతములుగ గావించుచున్నది. ఇంతియేగాదు. ప్రాచీనభాషలగు, గ్రీక్, ల్యాటిన్ అరాబిక్, పారశీకము మున్నగు సర్వభాషలకును సంస్కృతమే మాతృభాష యని ప్రాక్పశ్చిమ భాషా శాస్త్రపరిశోధకులగు పండితులు నిర్ణయించిరి. నేటికిని

భావికిని, భారతీయుల సర్వవిజ్ఞానవికాసమునకు సంస్కృతి నాగరికతలకు నిలయముగ వెలుగొందునది సంస్కృతమే. ఈ సాధనము మూలముననే మన జీవితములకు సర్వ విలక్షణ వికాసమును జేకూర్చుకొనజాలుదుము. యుగ యుగములుగ - చరిత్రకందని ప్రాచీన కాలమునుండియు, నిత్యనిర్మల పవిత్రప్రవాహములగు భారతసంస్కృతి నాగరికతలకు గైర్వాణియె జన్మస్థానముగ, జలాధార ముగ - ఊటగ విలసిల్లుచున్నది.

సంఘమును సంస్కరించి, సమీకరించి సరళమార్గ మున జీవుల నైక్యమొనర్చు పవిత్రరసాయన మిద్దియే. భారతీయుల చరమలక్ష్యము - పరమపదము బ్రహ్మాను భూతి. దీనిని సులభముగ నందించు ఆధ్యాత్మిక విజ్ఞాన వికాసము, బ్రహ్మజ్ఞానము అంతయు నిండే నిండి, నిబిడీకృతమై తొణికిసలాడుచున్నది. ఇంతియేగాదు. భౌతికాభివృద్ధిని జేగూర్చు శాస్త్రములగు - గణిత, వైద్య, ఖగోళ, భూగోళ, రసాయన, పదార్థ విజ్ఞానాది పెక్కుశాస్త్రములకు, గాన, చిత్రలేఖన, శిల్పాది లలిత కళలకును నిలయమై - క్రమముగ వీనిని భౌతికమునుండి- ఆధ్యాత్మికమునకు మార్చు పరుసవేదిగ విలసిల్లుచున్నది.

ఆంగ్లవిద్యావిధానమున మునిగి తేలు నవీన భార తీయులు కొందరు "సంస్కృతము పురాతనభాష. మృతభాష. అందు ప్రస్తుతము మనము నేర్చుకొనవలసిన

దేమియును లేదు. కావున నది యనవసరము. మన మభివృద్ధిని బడయవలెననిన ఆంగ్లభాషను - అందలి భావములను బఠింపనగును." అని వాదించుచుండుట కరము విచారకరము. అనుకరణము అభివృద్ధి గాజాలదు. పరుల ననుకరించువారికి సృజనశక్తి అడుగంటును. ఆత్మవిశ్వాసము, స్వాతంత్ర్యము మృగ్యమగును. తాము వికాసమును బడయజాలరు. ఇతరులకు తా మొసగజాలున దేమియు నుండదు. అంధానుకరణము అవివేకము. అవివేక మహంకారమునకు మూలము. అహంకారము అభివృద్ధికి గొడ్డలిపెట్టు. సంస్కృతమును నిరాకరించువారు తాము స్వార్థపరులై - పరులను పీల్చి పిప్పిజేయు జీవితవిధానమునకు లోనగుదురు.

సంస్కృతము పురాతనభాషయే. అది ప్రాచీనమైనంత మాత్రముననే విసర్జనీయమా? "నవ్యమంతయు భవ్యము గాజాలదు. ప్రాచీనమంతయు వర్జనీయమును గాదు" అని వివేకవంతులు నేటికిని యెలుగెత్తి చాటుచున్నారు. పురాతనమగు ప్రతివిషయమును విసర్జించువారి కనుభవము మృగ్యము; విజ్ఞానము చంచలము. స్థాయిదుర్లభము. స్థాయిలేని జీవితమునకు హాయిలేదు. కాబట్టి సంస్కృతాధ్యయనము సన్నగిలుట చేతనే మన విజ్ఞాన మడుగంటి, జాతిపతనమైనది. మనదేశము విదేశీయ వికృత దుర్భర దండయాత్రల కాలవాలమైనది.

ప్రజలు కృంగి కృశించిరి. స్వావలంబనము, స్వశక్తిపై నాధారపడు పటుతలు సన్నగిలినవి. మన దేశాభివృద్ధికి గాని, ప్రపంచ శాంతి సుఖములకుగాని దోహాద మొసగు కృషిని గావించిన ప్రాజ్ఞులు, మహాత్ములు, వివేకసంపన్ను లెల్లరును తమ విజ్ఞానవికాసభిక్షను సంస్కృతభాషా పఠనముననే బడసి, అందలి సంస్కృతి వికాసముచే వెలుగొందిన వారే. వంశపరంపరానుగత ముగ నేటికిని ఆ విజ్ఞానము మనయందు ప్రసరించి ప్రవ హించుచునే యున్నది. దానివంకకు దృష్టిని మరల్చిన వారి కది సువిదితము.

యుద్ధములు, బానిసత్వము, క్రూరమగు దాడులు, దోపిడివిధానములు మున్నగువానినెల్ల నధిగమించి గమ్య స్థానమునకు ప్రశాంతముగ గొనిపోవు నావగ దేవభాష వెలుగొందుచునే యున్నది. భారతసంస్కృతికి, మధురగాన ముతో నిత్యగీతికల నాలాపించుచునే యున్నది. కాబట్టి సంస్కృతభాష భారతికి ఆయువుపట్టు. చైతన్యమును, సృజనశక్తిని జేగూర్చు జీవగర్ర. ఇది మన కత్యావసరము. దీనిని మరచితిమా! మన ఉనికినే గోల్పోవుదుము. మన భావిని విస్మరింతుము.

తమ సాంప్రదాయానుభవములను విస్మరించిన ప్రాచీన గ్రీసు, రోము దేశముల కేగతి బట్టినదో ఒక్కపరి పర్యా లోకనమును గావించుడు. మనము నంతకు మిన్నగ నధో

గతికి, నీచస్థానమునకు దిగజారుదుము. అనంతకాలము నుండియు, వంశపారంపర్యముగ మన శరీరమున నిత్యము బ్రవహించుచుండు వినిర్మలరక్తము; తుష్టిపుష్టులను జేకూర్చు పవిత్రాహారజనితవిశుద్ధరక్తప్రవాహము దేహికవసరమా? యని ప్రశ్నించు శుష్కోపవాదములు మన పతనమునే జూపెట్టుచున్నవి. మాతృపోషణ శిశువునకు వాంఛనీయమని వాదింపవలెనా? దీనిని గూర్చి తర్కించుట అవివేకముగాదా! వెంగళితనమేగదా! ఇట్టి భ్రమాజనితావేశము, ఉన్మాదము నేడు పాశ్చాత్యవ్యామోహపరులగు భారతీయుల కొందరి నావేశించినది. వీరికి స్వయంశక్తిగాని, దూరదృష్టిగాని లేదనవచ్చును. చూడుడు! సంస్కృతభాషావిశిష్టతను, అందలి విజ్ఞానమాధుర్యమును విస్పష్టముగ గ్రహించి, చవిజూచిన పాశ్చాత్యదేశము లద్దాని ప్రచార ప్రబోధములకు, అందలి విజ్ఞానామృత పానమునకు విపులధనమును, శక్తిని వినియోగించుచుండ, భారతీయులమగుమనము సంస్కృతమును నేర్చుకొనుటయా? లేదా? యనువాదములలో విలీనమగుచుండుట నేమనవలెను?

ప్రాచ్యవిజ్ఞాన వికాసమును చవిజూచిన పాశ్చాత్య పండితులు తమ జీవిత సర్వస్వము నద్దానికి సమర్పించి శ్రద్ధాభక్తులతో, అనురాగాభిమానములతో నద్దానిని గౌరవించి, కీర్తించి, వ్యాప్తమొనర్ప ప్రశస్తకృషిని

గావించుచుండిరి. గుప్తముగ మరుగుపడియున్న ప్రాచ్య లిఖితగ్రంథములను వెలికిదీసి, పరిశోధనములను గావించి, యందలి సత్యములను బ్రకటించుచుండిరి. కాని మనమో! చేతులు గట్టుకొని, వారి పరిశోధనములకు విభ్రమాశ్చర్యముల జెందుచుంటిమి.

పాశ్చాత్య భోగలాలస జీవితమునందలి బుద్బుదప్రాయములగు తాత్కాలిక జీవితసౌఖ్యములకు భ్రమసి యద్దానికి దాస్యమొనర్చు భారతీయుల మైకమింకను వీడ లేదు. ఆ మత్తుచే కైపెక్కియున్న వారికి, సంస్కృత భాషావిజ్ఞానవికాస మాధుర్యము, ప్రాచీనభారతి యౌన్నత్యము లెట్లు గోచరములగును? ఇట్టివారి, చిత్తవిభ్రమమును బారద్రోలి వారియందు సామాన్యవిజ్ఞానమును, సాదరభావములను రేకెత్తించుటకైనను సంస్కృతభాషా పఠన మత్యవసరము. అట్టి పఠనమే వారిని విశ్వవిఖ్యాత భారతీయసంస్కృతి శిఖరము నధిరోహించు సరళమార్గముల బయనింపజేయుట తథ్యము.

పాశ్చాత్య భావదాస్యులు, ఆంగ్లభాషామానసులు "మేమే విజ్ఞానులము. భావసౌష్టవమున, భాషాపాండిత్యమున నగ్రగణ్యులము." అని విచ్చలవిడిగ తమను గూర్చి తామే ప్రచార మొనరించుకొనుచున్నారు. ఇంతటితో సంతృప్తిని జెందిన కొంతకుకొంత సంతసమే. ప్రాచీన విజ్ఞాన సంరక్షకులగు సంస్కృత పండితులను

"ఛాందసులు; సంకుచితభావులు, అభివృద్ధి నిరోధకులు"అని విమర్శించి, వెక్కిరింప సాహసించుచున్నారు. తమ మాతృదేశ సంస్కృతి నాగరికతలను, భాషను తమ యమూల్యసంపదగ భావించి అభిమానముతో నాదరభావమును ప్రకటించుటకు సిగ్గును జెందుచున్నారు.

'భిక్షాం దేహి' యని పరుల నర్థించుచు తమయింట గల మధురాహారమును మంటగలుపుచున్నారు. తమ యింటనున్న పరమాన్నమును తృప్తిగ భుజించి, జీర్ణించుకొనుటకు మారు, పరాన్నభుక్కులై దానిని జీర్ణమొనర్చుకొనజాలక బాధపడుచుండిరి. తమ్ము తాము హైన్యపరచుకొనుటచే, పరులును వీరిని నీచముగనే జూచుచున్నారు. తమ దేశమునందే విదేశీయజాతిగ బ్రతుకుటకంటెను లజ్జాకరమగు విషయము మరెద్దిగలదు ?

క్రమశిక్షణాసంభరితము, సౌష్టవ సర్వాంగసుందరమునగు మన సారస్వతమును, సంస్కృతిని సక్రమముగ వినియోగించుకొనుచు, పరుల విజ్ఞానమును మన తత్వమునకనుగుణ్యముగ మార్చుకొని జీర్ణించుకొనుట లెస్స. యోగ్యమును స్వీకరించి, తద్భిన్నమును విసర్జించు వివేకమును గలిగియుండనగును.

భాష, పదముల – వాక్యముల సమూహము గాదు. జాతియందలి యున్నతభావములను, ఉత్కృష్టాదర్శము

లను బ్రకటించు సాధనము. జాతిజీవితమున లీనమై శీల ప్రవర్తనములపై స్వీయప్రభావమును బ్రసరింపజేసి జ్యోతిర్వికాసమును జేకూర్చు విద్యుత్తు. సరళ, సుందర మృదుమధురభాషయే మన భావముల నత్యున్నత దృక్పథమునండిడి ఉత్తమాదర్శములవంకకు మరల్చి శీలస్వభావముల తీర్చిదిద్దు పరమసాధనము కాగలదు. అట్టి భాషోచ్చారణాస్ఫురిత నాదమును, తత్సంకీర్తనాకలిత మధురగానమును, జాతిసౌష్టతకు, సంస్కృతి వికాసమునకు దోహదము నొసగి జాతిని చైతన్యవంత మొనర్చును. చరిత్రకందని ప్రాచీన కాలమునుండియు భారతి నేకదేశముగ గీర్తించుచు, భారతీయుల నేకజాతిగ సమ్మిళిత (సంఘటించి) మొనర్చి, ఆ సేతు హిమాచలపర్యంతమును, సుగంధ మధుర గానముతో ఆధ్యాత్మిక వికాసతను బ్రసరింపజేసినది సంస్కృతభాషయే. ఆధ్యాత్మిక, నైతిక, సాంఘిక, రాజకీయములను సమన్వయించి జాతిని పరిపూర్ణవంత మొనర్చిన దివ్యభాష సంస్కృతమే. ఇట్టి ఉన్నతశక్తిదాతను, ఉజ్జ్వలభావతరంగ సముపేతను, సంస్కృతభాషను తృణీకరించుట పతనహేతువేగదా! కాబట్టి సంస్కృత భాషను భారతదేశమునందంతటను వ్యాప్త మొనర్పవలెను. అందలి యమూల్య భావరత్నములను వెలికిదీసి ప్రజలకు విరివిగ నందించు దనుకను మనజాతికి వికాసాభివృద్ధులు జేకూరజాలవు.

నేటికిని భారతదేశము పెక్కురు పరదేశీయులకు ఒక ప్రత్యేకవిలక్షణముచే వెలుగొందు దేశముగనే విరాజిల్లు చున్నది. బ్రహ్మానుభూతిసంపన్నులగు సన్యాసులకు, యోగులకు, అవతారమూర్తులకు, పురుషోత్తములకు, తాపసులకు నాలవాలమై పరదేశజుల నాకర్షించుచునే యున్నది. ఈ ఆధ్యాత్మిక వికాసఫలితముగనే పరు లీదేశ మును ప్రేమించి కీర్తించుచున్నారు. పరదేశజులు క్రూర దాడులను గావించి మన భౌతికసంపదలను కొల్లగొట్టుకు పోయినను భారతి ప్రేమ త్యాగములకు, భక్తి శ్రద్ధలకు, సేవాసంపదలకు నిలయమై అహింసను, శాంతిని ప్రపం చమునకు ప్రబోధించుచున్నది. నవీన ప్రపంచమున పాశ్చాత్యదేశములు విచ్చలవిడిగ స్వైరవిహారములను గావించుచు, భౌతిక భోగలాలసజీవితమును ప్రబలించు కొని, తృష్ణను, స్వార్థమును రేకెత్తించి, యీర్ష్యా ద్వేషములను, అహంకార మమకారములను తాండ వింప జేయుచు నున్నవి. తా జెడ్డకోతి వనమెల్ల చెఱచినట్లు తాముచెడి పరులను పాడుచేయుచున్నవి. తత్ఫలితముగ పరస్పరస్పర్థలు, పోటీలు, చెలరేగినవి. యుద్ధములు, మారణయంత్రములు వికృతాట్టహాసము లను గావించుచు, మానవులను మృత్యుదేవతకు బలి యొసంగుచున్నవి. బీభత్సము, రక్తపాతము భీకరా కృతిదాల్చి విజృంభించుచున్నవి. ఇట్లు మానవులు

సదా కష్టపరంపరల దగుల్కొని, క్లిష్టసమస్యలకు గురియై భౌతిక తత్త్వావేశముచే సర్వమును విషమింపజేసి విషమయులుగ గావింపబడిరి. సర్వప్రపంచమును యిట్టి భీతిలి ప్రేమసహనములకు, శాంతిసంరక్షణములకు, సేవాత్యాగములకు మన దేశమువంకకు మోమెత్తి యెదురు జూచుచున్నది. మన ఆధ్యాత్మిక వికాసజీవిత విధానమే యిందులకు ప్రధానకారణము.

"మన దేశమునందలి పాశ్చాత్యభావదాసులు ఆకాంక్షించుచున్న రాజకీయవిధానములు, ప్రాకృతతత్వములు, శతాబ్దములుగ పాశ్చాత్య దేశములందు ప్రచార ప్రబోధములకు గుఱియై ఆచరణమునందుంచబడినవియే. అవి నిష్ప్రయోజనములని యా దేశము లనుభవముచే దెలిసికొని – ఆధ్యాత్మిక దృక్పథమునకు, తిరిగి మన దేశము వంకకు తమ దృష్టులను మరల్చుచున్న యీ తరుణమున, పాశ్చాత్యులు గర్హించి, విసర్జించుచున్న విషయములకు మన మేగ ప్రాకనేల? పాశ్చాత్యులు నేడు విశ్రాంతి నెరుగని యలజడిని గావించు యంత్రములుగ మారిరి. భౌతిక విధానములకు విసుగును జెంది – స్వస్తిని జెప్పి, ఆధ్యాత్మిక వికాసమునకు కృషిని గావింపనిచో, యేబదిసంవత్సరముల లోపుననే, వారు కృంగి, కృశించి, వినాశనమును జెందుదురు."

— వివేకానందస్వామి.

ఇవి ఋషి సత్తముని పలుకులు. యోగిపుంగవుని వాక్కులు. అవి నేడు ప్రత్యక్ష సత్యములుగ మన కన్నుల యెదుట తాండవ మాడుచుండుటలేదా? అవి ప్రబలముగ ధృవపడుటలేదా?

కాబట్టి భారతీయుల మగు మనము, పాశ్చాత్యులను గుడ్డిగ ననుకరించుచో, వారికిబట్టిన దుఃస్థితియే మనకును బట్టును. ఆధ్యాత్మిక వికాసము లేని జాతి, చైతన్యమును గోల్పోయి నిర్జీవముగ నుండవలసినదే. అట్టి దేశము పశుతుల్యులగు, హింసాపరులకు, దోపిడిగాండ్రకు క్రూరులకు ఆలవాలమగును. కావున "భారతీయులకు మతమే జీవితపరమావధి. ఆధ్యాత్మికతను వెనుకకునెట్టి రాజకీయపు మెరుపులకు, తాత్కాలిక సాంఘికసంస్కరణములకు, భౌతిక భోగభాగ్యములకు ఆలవాలమగు దేశము అస్తమించితీరును. భారతదేశ మిట్లు నశించునా? అట్లే యగుచో ప్రపంచమున ఆధ్యాత్మికతయే నశించును. పవిత్రత, నీతి మరుగుపడును. ఆదర్శము లంతమొందును. స్త్రీ పురుష కామలాలస జీవితము విజృంభించును. అట్టి దేశమునకు ధనమే పూజారి. కుట్రలు, స్పర్ధలు, పశుబలము పూజావిధాన సాధనములు. అందు మానవాత్మ నిస్సంశయముగ బలియగును. ఇది భారతదేశమున జరుగుట అసంభవము."

— వివేకనందస్వామి.

"ప్రస్తుతము మన దేశమున దారిద్ర్యము తాండవమాడుచున్నది. నిత్యజీవితావసర వస్తువులకొఱత మితిమీఱినది. ఆహారము లేక ఆకటిబాధచే ప్రజలు అలమటించుచున్నారు. ఇట్టి దుర్భరదుఃస్థితిలో మునిగియున్న తరుణమున ఆధ్యాత్మిక ప్రబోధముల ప్రయోజనమేమి? దారిద్ర్యమును రూపుమాపుటకును, ఆహారపు కొరతను దీర్చుటకును కృషిని గావించుట పాడిగాదా? మన సర్వశక్తుల నీకృషికి వినియోగించుట మన ప్రధాన ధర్మము" అని కొందఱు నుడువుదురు. ఇది వాస్తవమే. దీనిని వెంటనే అంతరింపజేయవలసినదే. కాని, దారిద్ర్యమును రూపుమాపుటకును, సంపదల సమకూర్చుటకును నిష్కామ్యకర్మ, నిత్యకృషి, త్యాగశక్తి యత్యవసరములు. ప్రేమాదరణములు, త్యాగశీలములు, దయాదాక్షిణ్యములు, సహానసఖ్యతలు లేనిజాతి ఆర్థికసౌష్ఠవమును బడయుచో, పాశ్చాత్యుల క్రూరదాడులచరిత్రయే, ఆ జాతియందు పునఃస్థాపితమగును.

కాబట్టి భారతక్షేత్రమున విశుద్ధరక్తము గంగా ప్రవాహమువలె నిరంతరము బ్రవహింపవలెను. రక్తము పరిశుభ్రముగ నుండినపుడే రోగములు కాపురము చేయజాలవు. మన జాతికి, మానవ ప్రపంచమునకు పరిశుభ్రరక్తదాత ఆధ్యాత్మికానుభూతియే. దేహమున పరిశుభ్రముగ, స్వచ్ఛందముగ, పవిత్రవంతముగ, బలిష్ఠముగ,

వినిర్మల పవిత్ర గంగావాహినివలె శక్తిని బ్రవహింపజేయునది ఆధ్యాత్మికతయే. ఇట్టి ఓజోశక్తిప్రవాహమే శారీరకారోగ్యమును, మానసికపుష్టిని, ఆత్మవికాసమును అందించి పూర్ణత్వమును చేకూర్చగలదు. అప్పుడే రాజకీయ, ఆర్థిక, సాంఘిక సమస్యలు చక్కబడును. దారిద్ర్యాజ్ఞానము లచిరకాలముననే యంతరించును. ఇట్టి సర్వతోముఖ వికాసమునకు సాధనము సంస్కృతభాషయే. ఇదియే భౌతికాధ్యాత్మికములను సమన్వయించి మానవునకు దివ్యత్వమును - పురుషోత్తమత్వమును అందించును. ధర్మసంస్థాపన యన అభ్యుదయ నిశ్శ్రేయములు తాండవమాడుటయే. సంస్కృత సారస్వతమున బ్రహ్మవిజ్ఞాననిధులగు వేదములు, ఉపనిషత్తులే గాక శాస్త్రములు, కళలు విపుల వికాసము నందినవి. పాశ్చాత్యులు తమ శాస్త్రములకు వలయు బీజముల నిందుండియే సంగ్రహించిరి. కాబట్టి భారతీయులు సంస్కృతభాష నభ్యసింపనిచో తమ గోతులను తామే త్రవ్వుకొందురు.

సంస్కృత సాహిత్యమునందుగల భాషాపటుత్వమును, భావగాంభీర్యమును, కవితామాధుర్యమును, పదలాలిత్యమును మరి యేభాషయందును గాంచము. ఆధ్యాత్మికపర చింతనా తత్త్వములను, శాస్త్రములను, కళలను భారతీయులు కవితలో, శ్లోకబద్ధములుగ సంగ్రథించిరి. గణితము, శిల్పము, వైద్యము, కళలు, రసాయన పదార్థ

విజ్ఞానాది శాస్త్రములు, వేదాంతము, సర్వమును శ్లోక బద్ధమే. గానయోగ్యమే. సంస్కృతభాష భారతీయుల నందరను కవులుగ, గానకోవిదులుగ మధురభావప్రకటనా ప్రవీణులుగ గావించినది. సర్వప్రకృతి (విశ్వము) నొక శ్లోకముగను, భగవంతుని తత్ శ్లోక కర్తగను గావించి గాన మొనర్చినది సంస్కృతభాషయే.

సంస్కృతము నభ్యసింపక యితరభాషలయందలి విజ్ఞానార్జనకు గడంగుట మూలమును ఛేదించి, వృక్షమును పోషించుటయే. చరిత్రకందని ప్రాచీనకాలము నుండియును సంస్కృత సారస్వతము మనదేశమున వ్యాప్తమై, విశాలముగను, గాఢముగను వేరులు పాదుకొని వర్ధిల్లినది. ఇందలి విజ్ఞానమునంతయు ప్రాంతీయ భాషలలోని కనువదింపబూనుట దుర్లభము. అందలి యుత్కృష్టభావములను ప్రాంతీయభాషలద్వారా ప్రబోధము గావింపవచ్చును. కాని, మన దేశమున సంస్కృత భాషను నిర్బంధముగ బఠింప నంతదనుకను అందలి యమూల్య రత్నసంపదను వెలికిదీయుట యసంభవము, దుర్లభము.

"సంస్కృతాధ్యయనము కష్టభూయిష్ఠము" అని కొందరు నేడు వాదించుచున్నారు. కాని బాల్యము నుండియు, ఆంగ్లభాషను పఠించుటకు మనము వ్యయపరచు జీవితకాలము - దాదాపు 20 సం. అయిన

నందెందరు ప్రావీణ్యతను బడయుచుండిరి ? లెక్కకొక్కడు గూడ లేడే ! సంస్కృతభాష నభ్యసించుట కొంత కష్టమే యయినను ఆంగ్లభాషాపఠనమునకు వ్యయపరచు అర్ధకాలములో భారతీయులమైన మనము అందు ప్రావీణ్యతను బడయగలము; పండితులము గాగలము. అది మన రక్తనాళములందు వంశానుగతముగ బ్రసరించి, బ్రవహించుచునేయున్నది. సజీవముగ వెలుగొందుచునే యున్నది. ఇంతియేగాదు; మన ప్రాంతీయ భాష లన్నియును సంస్కృతమునుండి యుద్భవిల్లినవేగదా ! కాబట్టి సంస్కృతభాషా పఠనము మనకు విజ్ఞాన వికాసమును చేకూర్చుటయేగాక, ప్రాంతీయభాషలకు దోహదము నొసగి, నవనవోన్మేషమును చేకూర్చును. బుద్ధుడు, రామానుజుడు, చైతన్యుడు మున్నగు మహాత్ములెందరో, సామాన్య ప్రజలకు వారిప్రాంతీయభాషలలో సులభముగను, శీఘ్రముగను విజ్ఞానవికాసప్రబోధములను గావించినది తథ్యమే. కాని యీ విజ్ఞానమును స్థిరపరచి, దాని స్థాయిని, ప్రతిష్ఠను చేకూర్చు సంస్కృతభాషాపఠనము లేకుండుటచే నా విజ్ఞానము నిలువజాలకపోయెను. అందు శాంతి, ప్రతిష్ఠలు ప్రబలజాలకపోయెను.

విషయములను కుప్పతిప్పలుగ ప్రజల కందించినంత మాత్రమున బ్రయోజన ముండదు. అవి వారియందు జీర్ణమై యనుభూతిని బడయవలెను. దీనిని సాధింపజాలు

నది సంస్కృతభాషయే. కాబట్టి మధురభావములను ఫలములను ఆస్వాదింపగోరుచో, ప్రథమదశలో మనము కొంత శ్రమకు, కష్టములకు గుఱిగావలెను. 'కష్టే ఫలీ' కష్టమునందే ఫలితము. కష్టములేక ఫలము లుండవు.

ప్రథమమున బౌద్ధులు ప్రజలకు ప్రాంతీయభాషలలో ప్రబోధములను గావించినను, తదుపరి అనుభవముచే సంస్కృతభాషా ప్రాధాన్యతను, ఆవశ్యకతను గ్రహించి సంస్కృతభాషను ప్రచార ప్రబోధములకు గుఱినిగావించిరి. పెక్కుగ్రంథముల నందే రచియించిరి.

పాశ్చాత్యుల రాజకీయ, సాంఘిక ఆర్థిక విధానములను, భావములను ఆంగ్లభాషలో ప్రబోధమునకు దేబూనువారును తమ చిత్తశుద్ధిని, లక్ష్యసిద్ధిని విస్పష్టమొనర్పవలెను. భారతవికాసమును, తన్మూలమున విశ్వశాంతిని, మానవకళ్యాణమును చేకూర్చు ప్రాచీనభారత విజ్ఞానవీచికలను దేశమునందంతటను ప్రచార మొనర్చుట మనవిధి. ఉత్కృష్టభావములను, నిత్యసత్యములను, ధర్మప్రబోధములను వేదములందే గాంతుము. వేదములను పరమప్రమాణముగ నిడికొని, వాని నాధారములుగ గావించుకొని, బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులు, రామాయణము, గీత, భారతము మున్నగు గ్రంథములు ధర్మమును, శీలసంపత్తిని, నీతిని, సత్ప్రవర్తనములను గూర్చిన గాథలను, వ్యాఖ్యానములను,

పెంపొందించుకొనెను. వేదములను(శ్రుతుల) ప్రమాణముగ నిడికొనియే వానిని బఠింపవలెను.

మతసంస్థలు, ఆచార్యపీఠములు, పండితపరిషత్తులు, పరిశోధకసంఘములు, భాగ్యవంతులు – యెల్లరును యీ భావి భారతభాగ్యోదయకృషికి, విశాలవిశ్వమానవ వికాసమునకు నిరంతరము తమ ధనమును, పరిశ్రమమును, సేవను అందింపవలెను. ఇట్టిలక్ష్యముతో, సంస్కృతభాషావ్యాప్తమును గావించు కేంద్రసంఘము నొకదానిని స్థాపింపవలెను. భారతదేశమున, నలుమూలల, ప్రతిగ్రామమునందునను దీని శాఖోపశాఖలను, నెలకొలుపవలెను. ముద్రణముగాక, మరుగుపడియున్న, తాళపత్ర, లిఖిత గ్రంథములను సంగ్రహించి, పరిశీలించి, పరిశోధనములను గావించి ప్రకటింపవలెను. పరిశోధక, ప్రచారకసంఘము లీ కృషికి తమ సర్వశక్తిని, కాలమును వినియోగించిన అచిరకాలముననే స్వతంత్రభారతి తన సముచితస్థానము నందుకొని, ప్రపంచమునకు, మకుటమై, గురుపీఠముగ వెలుగొందుట తథ్యము.

సంస్కృత విశ్వవిద్యాలయములను, కళాశాలలను విరివిగ స్థాపించి, అందు బాలబాలికలకు ఉన్నత విద్యను, విశాల భావములను బడయు శిక్షణము నొసగు సదవకాశములను గల్పింతురు గాక !!

# సంస్కృతము -
# జర్మనీ, పాశ్చాత్య దేశములు

భారతీయుల సంస్కృతి నాగరికతలను, సత్సాంప్రదాయములను విశదీకరించు విజ్ఞానార్జనమునకు తీవ్రకృషిని గావించిన పాశ్చాత్యులలో జర్మనులు అగ్రస్థానము నధిష్ఠించిరి. గ్రీకు, ల్యాటిను చరిత్రకారుల నుండియు, అలెగ్జాండరు - ది- గ్రేట్ చక్రవర్తి నుండియు భారతదేశమును గూర్చిన గాథలను జర్మను లెరింగిరి. తత్ఫలితముగ విజ్ఞాన పిపాసులగు జర్మనులు భారతీయ సంస్కృతి విజ్ఞానములచే నాకర్షింపబడి సంస్కృతభాషా పఠనమునకు గడంగిరి. ప్రప్రథమమున - క్రీ. శ. 1480 సం.న ఆటన్ - వాన్ - ఫర్ సంస్కృతభాషనుండి పంచతంత్రమును జర్మనీభాషలోని కనువదించెను. ఈ గ్రంథమును జర్మను లతి యుత్సాహముతో బఠించి - అందలి గాథల ననుసరించి, తమ దేశమునందంతటను నైతికగాథలను, కథలను విపులముగ వ్యాపింపజేసిరి. జర్మనీభాషయందు వెలువడిన యిట్టి సమస్త గాథలకును పంచతంత్రము మూలాధారము. ఇటలీ దేశస్థుడు - మార్కొపోలో, భారతదేశమును గూర్చిన కొన్ని విషయములను వివరముగ ప్రకటించెను. క్రీ. శ.

1498 సం.లో పోర్చుగీస్‌వాసి - వాస్కోడిగామా యూరప్ నుండి - భారతదేశమునకు సముద్రమార్గమును గనిపెట్టెను. 1615 సం.న అబ్రహాముహోజర్సు డచ్చి భాషలో (Open door to hidden Heathendom) అను గ్రంథమును బ్రచురించెను. జర్మను లీ గ్రంథమును తమభాషలోని కనువదించుకొని, క్యాథలిక్ మిషనరీల దృక్పథమున వివరింపబడిన హిందూమతమునుగూర్చి కొలదిగ దెలిసికొనజాలిరి. 1650 సం. నుండి ఫాదర్ హెన్రీరాత్, జె. యి. హన్గ్జలన్ అనువారు సంస్కృత భాషలో కొంతకృషిని గావించిరి. 1785 సం.లో సర్. చార్లెస్‌విల్కిన్సు భగవద్గీతను, 1789 సం.లో సర్. విలియమ్‌జోన్సు కాళిదాసుని శాకుంతలమును ఆంగ్లభాషలోని కనువదించిరి. 1794 సం.లో హెచ్. టి. కోల్బ్రూక్ మనుధర్మశాస్త్రము ననువదించి - దానిపై కొన్నివ్యాస ములను బ్రకటించెను. భారతదేశమునందే నివసించుచు, సంస్కృతభాషను బాగుగ నభ్యసించిన ప్రథమ ఆంగ్లేయుడు అలెగ్జాండర్ హేమిల్టన్. నెపోలియను యుద్ధముల ఫలితముగ నీయన ప్యారిసునగరమున నిర్బంధింపబడెను. ఆకాలమున - 1802 సం.న ఫ్రీడ్రిచ్‌ష్లెగెల్ ప్యారిసునగరమునందున్న హేమిల్టన్‌గారినికలిసి, వారికడ సంస్కృతము నభ్యసించెను.

తదుపరి తన పితృదేశమగు జర్మనీకి తిరిగివచ్చి, 1808 సం.న "హైందవులభాష, విజ్ఞానము" అను గ్రంథమును ప్రకటించెను. కాని,తదుపరి యేలకో, యీయన సంస్కృత భాషాపఠనమును చాలించెను. ఈయన సోదరుడు - విల్హెమ్‌ష్లెగెల్ మాత్రము భగవద్గీతను, రామాయణమును జర్మనీభాషలోని కనువదించి - ప్రకటించెను. 1818 సం. నుండి యీయన బాన్ విశ్వవిద్యాలయమున భారతవిజ్ఞానాచార్యుడుగ పనిజేసెను. ఈయన సమకాలికుడు ఫ్రాన్సిస్‌బాప్, 1816 సం. లో "సంస్కృతమున ధాతువుల సమన్వయవిధానము" అను గ్రంథమును రచించెను. తదుపరి 'నల - దమయంతి' యను గ్రంథమును, మహాభారతమునందలి కొన్ని భాగములను ప్రకటించెను. ఈ విధముగ జర్మనీ దేశమునందు పెక్కురు పండితులు సంస్కృతభాషను, భారతీయ విజ్ఞానమును, సంస్కృతి నాగరికతలను గూర్చి తీవ్రముగ కృషిని గావింపగడంగిరి. శకుంతల, గీతగోవిందము, మేఘసందేశము మున్నగు గ్రంథములను గూర్చి 'గొయతీ' (Goethe) దీర్ఘ పరిశ్రమమును గావించి, ఆ గ్రంథముల నెక్కుడుగ ప్రశంసించెను. తాను రచించిన ఫాస్టు (Faust) అను గ్రంథము, తన సంస్కృతపఠన ఫలితములగు పెక్కు భావముల సంపుటియే యని యెలుగెత్తి చాటెను. భారవి విరచిత కిరాతార్జునీయము అను గ్రంథముపై ఫ్రీడ్రిచ్,

రూయికష్టపు విపులపరిశ్రమమును గావించెను. బెర్లిను నగరమున విద్యామంత్రిగ నున్న విల్హెమ్ - వాన్ - హామ్ బోల్టు సంస్కృతభాషను పఠించి, అందు, అపారపాండిత్యమును గడించెను. "రాయల్ ఎకాడమి - ఆఫ్ సైన్సు" అను సంఘమున భగవద్గీతను గూర్చి పెక్కుయుపన్యాసముల నొసంగెను.

ఇమాన్యూల్ కాంటు, షెల్లింగ్ హెగెల్, స్కోపెన్ హోయరు మున్నగు సంస్కృతపండితులు, హిందూమతము, దార్శనికములు, ఉపనిషత్తులు మున్నగు తత్త్వగ్రంథములను గూర్చి దీర్ఘకాలము కృషినిగావించిరి. వీరి రచనములందు హిందూమతము, భారతీయ ఆధ్యాత్మిక విజ్ఞానముల ప్రభావమును విస్పష్టముగ-విపులముగ గాంతుము. "ఉపనిషత్తులే నా జీవితసర్వస్వము. ప్రపంచమున కాదర్శనీయుడగు బుద్ధుడు పురుషోత్తముడు" అని స్కోపెన్ హోయరు ప్రశంసించెను. ఇట్లు జర్మనీ సంస్కృతపండితులు 19 వ శతాబ్ది మధ్యకాలమువరకును, తాము సేకరించిన సంస్కృత విజ్ఞానమును 1843 - 1862 సం. ల వరకు, 'భారత ప్రాచీన విజ్ఞానము' అను గ్రంథమున క్రోడీకరించిరి.

ల్యాసెన్ పండితుడు నార్వే దేశమున జన్మించెను. కాని బాల్యమునుండియు ష్లెగెల్ పండితునికడ విద్యార్థిగ నుండి, సంస్కృతభాషా పాండిత్యమును గడించెను. ఈయన బాన్ విశ్వవిద్యాలయమునందు భారత విజ్ఞాన

మున కాచార్యులుగ నుండెను. బాన్ విశ్వవిద్యాలయము రైన్ నదీతీరమున నుండుటచేతను, జర్మనీకంతయు నది సంస్కృత విజ్ఞానార్జనమునకు కేంద్రముగ విలసిల్లుట చేతను, జర్మను లద్దానిని పవిత్రవంతముగ భావించి, 'జర్మనీ వారణాసి' యని కీర్తించిరి. జర్మనీ విశ్వవిద్యాలయము లన్నిటియందును సంస్కృతభాషను 1818 సం. నుండియు ప్రవేశపెట్టిరి. తత్ఫలితముగ నాభాష, వారి దేశమునందు వ్యాప్తమై పెక్కురు విద్జ్ఞుల నాకర్షించెను. సంస్కృతభాషను పఠించు విద్యార్థుల సంఖ్య మిక్కుటముగ పెరిగిపోయెను. వారిలో పెక్కురు సంస్కృత విజ్ఞానమునకే తమ జీవితములను ముడుపుగట్టి, అందు విస్తారముగ కృషినిగావించి, యూరప్ ఖండమునందంతటను ప్రఖ్యాతిని గడించిరి. తత్ఫలితముగ యితర పాశ్చాత్య దేశజులు తమతమ దేశములకు వీరి నాహ్వానించిరి. ఇట్టివారిలో ప్రధానుడు మ్యాక్సు ముల్లరు. ఈయన తండ్రి విల్హెమ్ ముల్లరు పండితుడు. 'డేసావు' (Dessau) పట్టణమునందు 1825 సం.న మ్యాక్సుముల్లరు జన్మించెను. 'యూజనేబర్నాఫ్' అను ఫ్రెంచిదేశపు సంస్కృత పండితునికడ, సంస్కృతభాష నభ్యసించెను. అందు విపుల విశిష్టవికాసమునుబడసి, యువకుడుగనున్న తరుణముననే 'ఈస్టు ఇండియా కంపెనీ' ధనసాయముచే ఋగ్వేదము ననువదించి, 1489-1875 సం. వర కద్దానిని

ప్రచురించుచు బ్రకటించెను. 1850 సం.న ఆక్స్‌ఫోర్డు విశ్వవిద్యాలయమునందు ఆచార్యులుగ నియమింపబడిరి. బాల్యమునుండియు, తన జీవితసర్వస్వమును, సంస్కృత భాషకును, హైందవ విజ్ఞాన ప్రచారమునకును ముడుపు గట్టిన ధీశాలి. షడ్దర్శనములను బ్రకటించెను. రామకృష్ణ పరమహంస జీవితమును, ఉపదేశములను బ్రచురించెను. 'ప్రాచ్యుల పవిత్ర గ్రంథములు' అను 50 సంపుటములను వెలువరించెను. ఈ మహాత్ముని కృషిఫలితముగనే బెక్కురు సంస్కృతపండితులు వెలసిల్లిరి. వీరిని వివేకానందస్వామి, సాయనాచార్యులని యుగ్గడించెను. ఈ మహాత్ముడు 1900 సం.న పరమపదించెను.

థియొడోర్ గోల్డుస్టకర్, థియొడోర్ ఆఫ్రెచ్, ఎగ్గింగ్ కీల్‌హారన్, బుల్హార్, హాయెర్నల్, థీబాట్ మున్నగువారెందరో మనదేశమునందునను, ఎడింబరో పట్టణమునను సంస్కృతసారస్వతమునందు కృషినిగావించి, ప్రఖ్యాతిని బడసిన పండితులు. ముఖ్యముగ మాక్సుముల్లరు కాలమునుండియు జర్మనీయందు వేదవిజ్ఞాన పరిశోధనాపిపాస ప్రబలెను. నాలుగువేదముల సంహితలను సమగ్రముగ సంగ్రహించి, ప్రకటించిరి. మాక్సుముల్లరు, థియొడోర్ ఆఫ్రెచ్ ఋగ్వేదమును, 1848 సం.లో బెన్‌ఫే సామవేదమును, ఆల్‌బ్రెక్టు వీబరు, లియొపోల్డు - వాన్ - ష్రొయిడరు గారలు క్రమముగ 1852 - 57 -

1881 – 1900 సం.లో యజుర్వేదమును, 1856 సం.లో రుడల్ఫురాత్ అధర్వవేదమును ప్రచురించిరి.

హెచ్. గ్రాస్మన్, ఏ. లడ్విగ్, కె. గెల్డనర్, హెచ్. ఓల్డెన్బర్గు, ఏ. హిల్ బ్రాన్డు, హెచ్. లూడర్సు మున్నగు జర్మనీ ప్రముఖపండితులు వేదములనుగూర్చిన పరిశోధనములను, అందలి మంత్రముల ప్రత్యేక విశిష్టతనుగూర్చి కృషిని గావించిరి. ప్రథమదశలో జర్మను పండితులు 'సంస్కృత – ఆంగ్లశబ్దకోశముల'ను వినియోగించుకొనిరి. రూకర్టుకవి విల్సను శబ్దకోశమునకు ప్రతిని సంపాదించుకొనెను. 1850 సం.లో బాప్, 1865 సం.లో బెన్ఫే, సంస్కృత ముఖ్యపదములకు జర్మనీభాషలో శబ్దకోశములను సంపాదించుకొని, వాటిని వినియోగించిరి. ప్రథమమున జర్మనీభాషలో శబ్దకోశమును రచియించిన పండితులు ఆటోబాట్లింగ్, రుడల్ఫురాత్. వీరు 1852 – 75 సం.లలో తమ శబ్దకోశమును 7 సంపుటములుగ ప్రకటించిరి. తదుపరి ఆటోబాట్లింగ్ మరియొక చిన్న శబ్దకోశమును ప్రకటించెను.

సంస్కృతసారస్వతము – అందలి విజ్ఞానమును గూర్చి జర్మనులు గావించిన కృషి, అందు వారికిగల ఆదరాభిమానములు, భక్తిశ్రద్ధలు వర్ణింపనలవిగానివి. సంస్కృత నాటకములు, కావ్యములు జర్మనీయందంతటను విపులముగ బఠింపబడెను. శాకుంతలము, విక్రమోర్వశీయము,

దశకుమార చరితము, మృచ్ఛకటికము పెక్కుముద్రణము లను బడసెను. హితోపదేశము, భర్తృహరి సుభాషితము పాఠశాలలయందుసామాన్య పాఠ్యగ్రంథములుగవిలసిల్లెను.

1839 సం.న, ఓటోబాట్లింగ్ పాణిని వ్యాకరణమును జర్మన్ భాషలోని కనువదించెను. ఆచార్య లీబిచ్ మున్నగు పండితులు ప్రత్యేకముగ వ్యాకరణపఠనము నందు శ్రద్ధ వహించిరి. మన ధర్మశాస్త్రములను బూహార్, జాలీపండితులు ఆంగ్లభాషలోని కనువదించిరి. ఉర్జుబర్గు విశ్వవిద్యాలయమున ఆచార్యుడుగ నున్న కాలమున ఆచార్య జాలీ మనుస్మృతి, ధర్మశాస్త్రములు, ఆయుర్వే దము మున్నగు అపరవిద్యలను గూర్చి విపులకృషిని గావించెను. తత్ఫలితముగ జర్మనీ విశ్వవిద్యాలయములు, వీరి పాండిత్యమును ప్రశంసించి, వీరిని సత్కరించి 'న్యాయ, వైద్యశాస్త్రశిరోమణి' (Doctor of Law & Medicine) బిరుదముల నొసంగెను.

వేదములు, ఉపనిషత్తులు, దర్శనములు, తత్త్వశాస్త్ర ములు మున్నగు పవిత్రగ్రంథములపై జర్మనుల అభిమాన మతిశయించెను. వారి కివి చిరపరిచిత గ్రంథములుగ విలసిల్లెను. రిచ్చార్డు గార్బే సాంఖ్యదర్శనమును, మ్యాక్సుముల్లరు; యి. రోయర్, ఏ. వింటరు, యి. హాల్టుజిచ్ పండితులు న్యాయ వైశేషికదర్శనములను ప్రకటించిరి. క్యాథలిక్ మతగురువు పుత్రుడు - పాల్

డ్యూసేన్ గొప్పతత్త్వవేత్తగ, వేదాంతిగ ప్రఖ్యాతిని బడయుచు 1889 - 1919 వరకు కీల్ విశ్వవిద్యాలయమున ప్రబోధములను గావించెను. ఈయన 1845 సం.న జన్మించెను. స్కోపెన్‌హోయరు ప్రబోధములచే నాకర్షింపబడి, సంస్కృతభాషయం దపార పాండిత్యము నార్జించెను. శంకరుని అద్వైతసిద్ధాంతము నం దెక్కుడు కృషిని గావించెను. 1883 సం.న అద్వైతప్రబోధప్రచారములకు గడంగెను. 1887 సం.న శంకర భాష్యమును జర్మనుభాషలోని కనువదించెను. 1897 సం.న ఉపనిషత్తుల నెక్కింటిని బ్రకటించెను. తన శిష్యుడగు ఆటోస్ట్రాసీతో కలసి, ఉభయులును భారతమునందలి తాత్త్విక సంబంధ విషయములను బెక్కింటిని 1906 సం.న బ్రకటించిరి. 'తత్త్వశాస్త్రచరిత్ర' (History of Phyloso . phy) యను గ్రంథమును పాల్‌డ్యూసేను పండితుడు ఆరుసంపుటములలో బ్రకటించెను. అందు మొదటి మూడు సంపుటములందును హైందవుల దార్శనికములు, తత్త్వశాస్త్రములను గూర్చియే ముచ్చటింపబడెను. ఈయన పాశ్చాత్యులయందు వేదాంతప్రభావమును బ్రసరింపజేసిన ప్రముఖపండితుడు. రుడల్ఫుఆటో విశిష్టాద్వైతమునం దెక్కుడుగ కృషిని గావించెను. రామానుజుని విశిష్టాద్వైతమును, వైష్ణవతత్త్వమును మెక్కుడుగ కీర్తించి, ప్రచారమొనర్చెను. హిందూమతమున కీ

మహానుభావుడు గావించిన సేవ అపారము. హెర్మన్ ఓల్డెనుబర్గు వినయపీఠికలను జర్మనీభాషలోని కనువదించెను. ఆల్బర్టుగ్రన్ - వెడెల్, ఆల్బర్టువాన్ - లీకాల్, హైందవకళలకు సంబంధించిన పెక్కు గ్రంథములను ప్రకటించిరి. ప్రేగ్ విశ్వవిద్యాలయమునందు ఆచార్యుడుగనున్న మారిస్ వింటర్నిట్జు హైందవసారస్వతముపై విశిష్ట పరిశ్రమమును గావించెను. సంస్కృతభాష జర్మనీ విశ్వవిద్యాలయము లన్నింటను అత్యుత్సాహముతో ప్రబోధింపబడుచుండుటచే అందు విపులముగ పరిశోధనములు, విమర్శనములు గావింపబడెను. ఈ విధముగ జర్మనీదేశమునందంతటను సంస్కృతభాషా సారస్వతముల ప్రభావము ప్రబలముగ ప్రసరించి, వ్యాప్తమై తాండవించెను. అట నెటజూచినను దీనిపై నాదరాభిమానములు, భక్తిశ్రద్ధలు నాట్యము లాడుచుండెను. కాని, మనదురదృష్టమో యన, గత రెండు మహాసంగ్రామముల వికృతరూపఫలితముగ జర్మనీదేశము ఘోరనష్టములకు కష్టములకు గుఱియగుటచే సంస్కృతభాషావ్యాప్తికి పెద్ద దెబ్బతగిలెను. హీన్‌రిచ్ హీన్‌కవి మధురాలాపముల నాలకింపుడు. "పోర్చుగీసులు, డచ్చివారు, ఆంగ్లేయులు భారతదేశమునుండి యద్దాని ఆర్థికసంపదలనెల్ల తమ దేశములకు స్టీమరులలో కొల్లగొట్టుకొనిపోయిరి. జర్మనులమగు మన మీవిషయమున వెనుకబడినను

భారతదేశ ఆధ్యాత్మిక సంపద నార్జించుటలో మాత్రము వెనుకబడరాదు. మన విశ్వవిద్యాలయము లిట్టి సంపదలను వికసింపజేయు ఫ్యాక్టరీలుగ వెలుగొందవలెను."

జర్మనీ భారతదేశములు సముద్రముచే వేరుచేయబడిన భిన్నదేశములుగ నున్నను, వీటి పరస్పరప్రేమానురాగములు మాత్రము పెంపొందితీరును. స్నేహితుడు దూరదేశముననున్నను దూరస్థుడు గాజాలడు. చంద్రుడు కుముదములకు దూరముగనున్నను నిశీథమున వాటిని వికసింపజేయుచునే యుండును.

దూరస్థోపిన దూరస్థః స్వజనానాం సుహృజ్జనః।
చంద్రః కుముదఖండానాం దూరస్థోపి ప్రబోధకః॥

భారత విజ్ఞానవికాసమునకు, సంస్కృతికి మూలమెద్ది? ఉత్పత్తిస్థాన మెచట ? సంస్కృతభాషయు, అందలి విపుల విజ్ఞాన వికాసములేగదా! "ప్రపంచమునం దన్నిప్రాంతములనుండియు ప్రజలు విజ్ఞాన పిపాసులుగ – ఆర్యావర్తనమున కేతెంచి, అందలి పండితులకడ శీలమును, సత్ప్రవర్తనమును, క్రమశిక్షణమును పెంపొందించు పాఠములను బఠింతురుగాక !" మనువు.

శతాబ్దములుగ భారతదేశము పరుల క్రూరదాడులకు, దోపిడి విధానములకు గుఱియాయెను. పర పరిపాలనాఫలితముగా బానిసత్వము ననుభవించెను. తన విజ్ఞానమును వికసింపజేసికొను సదవకాశములకు దూర

మాయెను. ఇట్లు కష్టనష్టములకు గురియైనను తన యమూల్య నిత్యసంపదయగు సంస్కృత సారస్వతమును జాగరూకతతో కొంతకుకొంతగ సంరక్షించుకొనుచునే యుండెను. మన కిపుడు స్వాతంత్ర్యము లభించినది. దానిసత్వ మంతరించినది. మన యింటిని మనమే చక్కబెట్టుకొను సదవకాశము చేకూరినది. కావున మన విశ్వవిద్యాలయములు దానిసవిలక్షణమగు అనుకరణమును వెంటనే విసర్జింపవలెను. మన సంస్కృతి సాంప్రదాయముల పునాదులుగ గావించి, విద్యావిధానమును పునర్నిర్మాణము గావింపవలెను. స్వాతంత్ర్యభావములను, సృజనశక్తిని, స్వశక్తిపై నాధారపడు ధీరత్వమును వర్ధిల్ల జేయవలెను. చైతన్యమును తాండవింపజేయవలెను. అప్పుడే మన దారిద్ర్యము నశించును. అజ్ఞాన మడుగంటును. సంఘము సమీకరింపబడి సహజకాంతులచే విలసిల్లును. పరిపూర్ణ వికాసమును బడయును. నీతి ప్రబలును. శీలము బెంపొందును. భౌతిక, ఆధ్యాత్మిక వికాసములతో ప్రపంచమున ప్రఖ్యాతిని బడయును.

సంస్కృతము కేవలము భారతదేశమునకే గాక సర్వ ప్రపంచమునకును మాతృభాష. సిలోను (లంక) సుమత్రా, బోర్నియో, జావా, ఫిలిప్పైను మున్నగు ఆసియా ఖండమునందలి దేశముల కావ్యసంపదకు మూలము సంస్కృతము. చాంపా, కాంబోడియా దేశములందు నేటి

కిని సంస్కృతభాషలో బెక్కు శాసనములను గాంతుము. చీనా, టిబెట్టు, జపాను దేశములు యీ భాషాప్రభావమును ప్రబలింపజేసికొనెను. కాబట్టి మనము వెంటనే మేల్కొని, సంస్కృతభాషా ప్రబోధ ప్రచారములను గావించినచో, నేటికిని అది ఆసియాఖండమునకు చైతన్యమును జేకూర్చుభాషగ విలసిల్లుట తథ్యము.

ఆఫ్ఘనిస్థాన ప్రభుత్వము, సంస్కృతభాషను, తన విశ్వవిద్యాలయమునందు నిర్బంధముగ ప్రబోధించు ఉత్తరువులను గావించెను. పుస్తూభాషను సౌష్ఠవవంతముగ గావించుటకు సంస్కృతమే పరమరసాయనమని యీ ప్రభుత్వము యెలుగెత్తి చాటుచున్నది.

భారతదేశమున ఆఫ్గనిస్థాన ప్రభుత్వరాయబారి సర్దారు గులామ్ మొహమ్మద్ గారు మధ్యరాష్ట్ర శాసనసభాధ్యక్షులగు ఘనశ్యామసింగుగుప్తగారికి వ్రాసిన లేఖను గాంచుడు. "పారశీక, పుస్తూభాషలు రెండును సంస్కృతభాషాజననములే. సంస్కృతపదములు, ఆ భాషల యందు కుప్పతిప్పలుగ గలవు. పుస్తూభాషను ముఁకను శాస్త్రయుక్తముగ గావించి, అభివృద్ధికి దెచ్చుటకే సంస్కృతభాషను కాబూలు విశ్వవిద్యాలయమునందు నిర్బంధముగ బఠింపవలెనను నిర్ణయమును గావించితిమి. దీనికి సంస్కృతము పూర్తిగ దోడ్పడునని నా దృఢవిశ్వాసము." 13-12-1948 నూతన ఢిల్లీ.

బెల్జియము దేశమునందలి బ్రుసెల్సు, లీజ్, ఘెంట్, లోవెయిన్ అను నాలుగు పట్టణములందు, నాలుగు విశ్వవిద్యాలయములు గలవు. అందు రెండు ప్రభుత్వాధీనములు. ఈ నాలుగు విశ్వవిద్యాలయములయందును, సంస్కృతభాషయు, సంస్కృత సాహిత్యమునందలి యుత్కృష్ట గ్రంథములను పరిశీలించి, పరిశోధనములను గావించు విధానమును ప్రబోధింపబడుచున్నవి. సంస్కృత భాషను అందలి విజ్ఞానమును ఆర్జించుటకు వలయు సర్వ విషయములయందును అట నిరంతరకృషి జరుగుచున్నది.

పాశ్చాత్యులే తమ దేశముల యభివృద్ధికి సంస్కృత భాష జీవగర్ర, శక్తిదాత యని కీర్తించుచుండ మనబుద్ధు లేమాయెను ? ప్రపంచమునందన్ని ప్రాంతములగల విజ్ఞానులు యిద్దాని నమృతతుల్యముగ నాస్వాదించుచు నమరత్వమును బడయుచుండ మన మిద్దానిని చులకనగ జూచుచు తృణీకరింపనేల ? నిర్ప్రయోజనమని త్రోసి పుచ్చనేల ? భారతి నైక్యమొనర్చి యేకదేశముగ గావించు శక్తి ప్రభావము లిందేగలవు. వేదములు, ఉపనిషత్తులు, దార్శనికములు మున్నగు ఆధ్యాత్మిక విద్యలకే సంస్కృతము నిలయము గాదు. భౌతికశాస్త్రములకు, కళలకు జన్మస్థానముగ విలసిల్లుచున్నది. వైద్య, గణిత, జ్యోతిష, రసాయన పదార్థ విజ్ఞానాది శాస్త్రములు,

వ్యవసాయ, పశుపోషణ, కుటీరపరిశ్రమల శిక్షణనొసగు వాఙ్మయము, లలితకళలు, అస్త్ర, శృంగార, ధర్మ, నీతి శాస్త్రములు, వర్తక వ్యాపారాది ఆర్థిక విషయములు, యింక నెన్నియో విద్యలకు సంబంధించిన గ్రంథములు, సంస్కృత సారస్వతమున నసంఖ్యాకములుగ గలవు. అవి ఆదరణలేక మరుగుపడియున్నవి. చరక, శుశ్రుత, ధన్వంతరి వాగ్భట, వరాహమిహిర, ఆర్యభట్ట, భాస్కరాచార్య, బ్రహ్మగుప్త, లీలావతి, ఖన్నా మున్నగు వారెన్నియో శాస్త్రములను వెలుగొందజేసిరి.

తమ శాస్త్రవిజ్ఞానవికాసమునకు సంస్కృతము ఉపజీవ్యముగ దోడ్పడి, దోహద మొసగినదని పాశ్చాత్యులే ప్రకటించి కీర్తించిరి. కాబట్టి మనము సంస్కృతమును బాగుగ నభ్యసించి, వ్యాప్త మొనర్పనిచో మన మార్జించిన స్వాతంత్ర్యము నిరర్థకమగును.

ప్రపంచమునందలి అన్ని ప్రాంతములనుండియు జ్ఞానార్జన పిపాసుల నాకర్షించిన ప్రాచీన విశ్వవిద్యాలయములు మన దేశమున వెలుగొందినవి. తక్షశిల, నలంద, అమరావతి మున్నగు విశ్వవిద్యాలయములు ప్రపంచమునకు విజ్ఞానభిక్షను విపులముగ ఉచితముగ బంచిపెట్టి గురుపీఠములుగ వెలుగొందినవి. పాహియాన్, హుయాన్ త్సాంగు మున్నగు పరదేశ విద్యార్థులు బెక్కు శ్రమ

లకు గురియై, మన దేశమున కేతెంచి, విపుల విజ్ఞానము నార్జించిరి. కాబట్టి నేటి మన విశ్వవిద్యాలయములు ప్రపంచమున గౌరవమగు స్థానమును, ప్రతిష్ఠను బడసి తమ నామమును సార్థకపరచుకొనవలె ననిన, సంస్కృత భాషను నిర్బంధముగ బఠించు నియమమును గావింప వలెను. అందలి సంస్కృతి, విజ్ఞానములను విరివిగ ప్రబోధ మొనర్పవలెను. నవ్యమును భవ్య మొనర్పజాలునది సంస్కృతమే.

దయానంద, వివేకానంద, రామతీర్థ, మహాత్మ గాంధి మున్నగు నవీన ఋషులు సంస్కృత భాషను, అందలి సంస్కృతిని బాగుగ నభ్యసించి, జీర్ణించుకొనియే విశ్వ విఖ్యాతిని బడయజాలిరి.

సంస్కృత సాహిత్యమున ముగ్ధులయిన పాశ్చాత్య పండితుల పలుకులను గాంచుడు:—

"సంస్కృతభాష ల్యాటిను భాషకంటె విశాలమైనది; వికాసవంతమైనది. గ్రీకు భాషకంటె నిర్మలమైనది. గ్రీకు ల్యాటిను భాషలకు మిన్నగ పరిపూర్ణమైనది."

—ఆచార్య కెనెత్ మాలిన్

"పందొమ్మిదవ శతాబ్ది ప్రారంభమున నవీనభాషా శాస్త్ర విజ్ఞాన పంకజములను, వికసింపజేయుటకు పాణిని వ్యాకరణ సూర్యోదయమును గావించినది

సంస్కృతభాషయే. భాషాశాస్త్రము భారతీయులకు 3000 సం.లకు పూర్వమే సువిదితము."

—అచార్య ఆర్. టి. హెచ్. గ్రిఫిత్.

"వ్యాకరణశాస్త్రము నభివృద్ధికి దెచ్చినవారు హిందువులు, గ్రీకులు మాత్రమే. కాని ప్రపంచమున ప్రఖ్యాతిని గాంచిన ఉత్తమ ప్రథమ వ్యాకరణవేత్తయగు పాణిని వ్యాకరణ సూత్రరత్నములతో బోల్చిచూచిన, గ్రీకుల యభివృద్ధి సూర్యునిముందు దీపము వంటిది."

—మ్యాక్సు ముల్లరు.

# పాశ్చాత్యదేశములు – వేదపఠనము

పాశ్చాత్యులు – అందు ముఖ్యముగ జర్మనులు సంస్కృతభాషను, మన సంస్కృతిని గూర్చి గావించిన కృషిని లోగడ వివరించితిమి. ఇక ప్రత్యేకముగ వేదములను గూర్చి వారు గావించిన పరిశ్రమ పరిశోధనములను విచారింతము. 16, 17 శతాబ్దములలో పాశ్చాత్య ప్రయాణీకులందు అచ్చటచ్చట నే యొకరో యిరువురో వేదములను గూర్చి వినినవారుగాని, కొలదిగ నెఱింగిన వారుగాని యుండుట సంభవము గావచ్చును. ఫాదరు కాల్మెటీనామ ఫ్రెంచివిజ్ఞాని, తెలుగులిపిలో అముద్రితముగ నున్న వేదప్రతి నొకదానిని సంపాదించెను. ఇట్లే క్రీ. శ. 1731 సం.లో ఋగ్వేదప్రతి యొకటి ప్యారిస్ పట్టణమునకు బంపబడెను. కాని ఫ్రాన్సుదేశమునకు బంపబడిన వేదములప్రతులకు వ్యాఖ్యానములుగాని, భాష్యములుగాని, వ్యాకరణములుగాని, శబ్దార్థకోశములుగాని లభింపమిచేతను, ఆ ప్రతుల లిపియు సుబోధకముగాకుండుటచేతను ఆ ప్రతులు మరుగుపడియే యుండెను. 18 వ శతాబ్ది మధ్యకాలమున యాంక్విటిల్ – డు – పెర్రాన్ అను విజ్ఞాని పారశీకభాషలో నున్న ఉపనిషత్తు నొకదానిని ల్యాటినుభాషలోని కనువదించెను. జెందు అవెస్తా యను పారశీకమతగ్రంథమును సేకరించెను. కాని

యీాయనకు సంస్కృతభాష తెలియమిచే నద్దానికృషి కెక్కుడుగ ఉత్సాహమును జూపెట్టలేదు. రమారమి 18 వ శతాబ్ది అంత్యమువరకును పాశ్చాత్యులకు వేదము లను గూర్చి బొత్తుగ తెలియదనియే నుడువవచ్చును. అంతియేగాదు. వేదములందలి యమూల్య విజ్ఞానము నెఱుంగకయే అవి ఫలదాయకములుగావనిన వాల్టేరు పలుకులును, వేదములు యితరగ్రంథములనుండి స్వీకరింప బడినవను సోనరెట్ పలుకులును వారి యవివేకమును, అజ్ఞానమునువిస్పష్టముగ-ధృవపరచుచున్నవి. ప్రథమమున వేదములనుగూర్చి ముచ్చటించిన ప్రాజ్ఞుడు హెన్రీథామస్ కోల్బ్రూక్. ఈయన 1801 సం.న, ఫోర్టువిలియమ్ కళా శాలలో ఆచార్యుడుగ నియమింపబడిన ప్రథమ పాశ్చాత్యపండితుడు. జయపురమునుండి బ్రిటిష్‌మ్యూజి యమునకు దేబడిన వేదముల ప్రతులను వీరు పఠించిరి. తత్ఫలితముగ కలకత్తానుండి వెలువడు 'ఏషియాటిక్ రిసర్చెస్' అను పత్రికలో 1805 సం.న వేదములు - హైందవుల పవిత్రగ్రంథములు' అను వ్యాసమును బ్రక టించెను. తన వ్యాసమునందు "ఈ వివరణము వేదములను గూర్చి ఈషద్వివృతి నొసగవచ్చును. వేదముల నన్నిటి నను వదింపవలెననిన, నవి చాల విస్తారముగనున్నవి. అందలి విషయములు మన శ్రమ కుచితఫలముల నొసగవేమో? అయినను విజ్ఞానపరిశోధకులగు పాశ్చాత్య పండితు లప్పు

డప్పుడు సంశయనివృత్తికి ఆ గ్రంథములను ఆధారముగ నిడుకొనవచ్చును." అని పాశ్చాత్యుల యావేశాగ్నిపై చన్నీళ్లను జల్లెను.

యూజనే బర్నాఫ్ అను ఫ్రెంచివిజ్ఞానవేత్తమాత్రము వేదములనుగూర్చి యుత్సాహావేశములతో, దీక్షగ కృషిని గావించెను. ప్యారిస్ కళాశాలలలో వేదములనుగూర్చి పెక్కు ఉపన్యాసములను గావించెను. వేదముల వ్రాత ప్రతులను సేకరించి, 'బిబ్లియోటీకా నేషనల్' అను గ్రంథాలయమున కొసంగెను. కాని, దురదృష్టవశమున వీనిని అచ్చువేయకపూర్వమే ఆయన పరమపదించెను. అయినను వేదములనుగూర్చి ఆయన యొసంగిన గంభీరోపన్యాసములు గోల్డుస్టకరు, రాత్, మ్యాక్సుముల్లరు మున్నగు జ్ఞానపిపాసుల నాకర్షించెను. వేదపఠనమునకు భిక్ష నొసంగిన మహానుభావుడు బర్నాఫ్ అనినుడువుట యతిశయోక్తి గాజాలదు. బర్నాఫ్ గారి నిరంతర ప్రోత్సాహ ప్రోద్బలముల ఫలితముగనే మ్యాక్సుముల్లరు 1843 సం.న లండనునగరమున కేతెంచి, అట ఋక్ సంహిత, సాయణభాష్యముల వ్రాతప్రతులను సంపాదించెను. ఇదే సంవత్సరమున, కోల్‌బ్రూక్ గ్రంథము నాధారముగ నిడికొని వేదములపై నొక యుత్కృష్ట గ్రంథమును (Zur Litherattur and Geschichte Des Weda) రుడల్ఫురాత్ జర్మనీభాషలో ప్రకటిం

చెను. అదే సంవత్సరమున నింకొక జర్మను పండితుడు 'యజుర్వేదము - దాని వ్యాఖ్యానము' అను గ్రంథమును జర్మనీభాషలో ప్రకటించెను. క్రీ. శ. 1846 సం.న వేద పఠనమునకు బర్నాఫ్‌గారు మూల స్తంభముగ విలసిల్లెను. అప్పటినుండియే పాశ్చాత్యులలో వేదపఠనమునకు ఉత్సాహోద్వేగములు ప్రజ్వరిల్లెను. అందు వారు తీవ్రకృషిని గావింప నడుము గట్టిరి. ఇట్టి ప్రోత్సాహము నుబడసియే 1846 సం.న బెన్‌ఫేపండితుడు జర్మనీ భాషలోనికి సామవేదమును, విల్సన్ పండితుడు ఆంగ్ల భాషలోనికిని, ల్యాంగ్లాయిస్ ఫ్రెంచిభాషలోనికిని ఋక్‌సంహితను అనువదించిరి.

బాట్లింగ్, రాత్ పండితులు సంస్కృత పదకోశమును ప్రచురించి భాషాసేవ నొనర్చిరి. ఈ విధముగ పెక్కురు పాశ్చాత్య పండితులు ఉత్సాహావేశములతో వేదములను గూర్చిన పరిశోధనములను, శాస్త్రసమ్మతముగ, చారిత్రకముగ గావింపదొడంగిరి. బౌద్ధ, క్రైస్తవ, మహమ్మదీయ గ్రంథములకన్నను మిన్నగ వేదములను భావించి, వాటి ప్రాచీనత నుగ్గడించుచు తమ ధనమును, కృషిని వేదాధ్యయనమునకే విరివిగ వినియోగించిరి.

జీవియందు గుప్తముగ, అనంత దివ్యశక్తిగ నున్న బ్రహ్మము నావిష్కరించు ఋషిసత్తములు, తపోనిష్ఠా సంపన్నులు, యోగులు, సహజసౌందర్య ప్రతిభా సంప

న్నులు నగువారి మధుర వచోమార్గమున ఆవిష్కృతమైన పవిత్ర నిత్యానంద గంగాప్రవాహమే వేదము.

"ఆర్యుల మనోహృదయములయందు ఆశ్చర్యా నందముల నావేశముతో నావిష్కరింపజేసిన సత్‌ను గూర్చి ప్రబోధించు దివ్య (ఋక్కులే) మంత్రములే వేదములు" అని విశ్వకవి రవీంద్రుడు కీర్తించెను. ప్రకృతి వికృతి ఫలితముగ భిన్నరూపులనుదాల్చిన శక్తియొక్క ప్రత్యంశమునను శ్రద్ధాభక్తులతో, సఖ్యస్నేహములతో, సహన శీలములతో దివ్యత్వము నాపాదించి ఆరాధించిన కోమల విశ్వాసము, భక్తిశ్రద్ధలను బ్రదర్శించు భక్తుల అనుభూతి ప్రకటనములు వేదములనుండియే గదా! మానవ జీవితమును విస్తరించి, వికాసవంతముగ, దివ్య వంతముగ గావించు అద్భుతజ్ఞాన ప్రదీపికలు వేదములు.

రవీంద్రుని 'గీతాంజలి' వేదవిజ్ఞాన వీచికల ముద్దు బిడ్డయే. వేదముల దివ్యభావముల ప్రతిధ్వనిని అందు విస్పష్టముగ గాంతుము. నవ్యసృష్ట్యారంభమున సర్వ నక్షత్రములును తమ ప్రథమకాంతిచే ప్రకాశించుచున్న తరుణమున ఆకాశపథమున దేవతలు సమావేశమై "ఆహా! పరిపూర్ణ చిత్తము! వినిర్మలానందము" అని గీతాంజలి గీర్తించిన భావములు ఋగ్వేదము నందలి "ఈ సృష్టి యెటనుండి యుద్భవించినదో యెవ రెరుగు దురు? అద్దానిని యెవరు బ్రకటింపజాలుదురు? విశ్వము

తన ప్రథమ ఉనికి నెటనుండి గలిగియున్నదో యెవ రెరుగుదురు? పరమపథమునుండి (ఉన్నత స్వర్గమునుండి) యీ సమస్త విశ్వమును శాసించు కర్త ఎరుగునేమో? బహుశా యెరుగడేమో? "యో అస్యాధ్యక్షః పరమే వ్యోమన్ సో అంగవేదయదివానవేద" యను (ఋక్కు) మంత్ర ఫలితములే గదా!

"ఓ జ్యోతి! నా జ్యోతి! విశ్వవ్యాప్తజ్యోతి! నయన చుంబిత జ్యోతి! మధుర హృదయ జ్యోతి!" అని ఉషను గూర్చి యానంద తన్మయ పూరితుడై గానాలాపన మొనర్చిన రవీంద్రునికవిత వేద నినాదఫలితమేగదా! ఇట్టి ఆనంద సంభరిత ప్రశాంతభావములు, సహజ సరళ కవితా మాధుర్యత, దివ్యప్రభావప్రసరిత ప్రకటనములు, ఆనాటి ఋషిపుంగవులకు, సామాన్య ప్రజలకు నిత్యాలాపనములుగ, సహజానుభూతులుగ విలసిల్లినవి. కాని, మన దురదృష్టమో యన, నిట్టి యుదాత్తభావములు భారతీయుల మగు మనయందు క్రమముగ దిగజారదొడగినవి. తదుపరి కవులయందును, గ్రంథకర్తలయందును యీ పతనమును విస్పష్టముగ మనము గాంచుచునేయున్నాము. ఇట్లు భారతీయులు ఆధ్యాత్మిక దివ్యజ్ఞానాభివృద్ధినుండి క్రమముగ దిగజారుచుండ - పాశ్చాత్యులు తమ నిమ్న దశనుండి క్రమముగ శాస్త్రవిజ్ఞానమునందునను, యితర విద్యలయందునను అభివృద్ధిని బడయుచుండిరి. పాశ్చా

త్ములు పరిణామవంతమగు వికాసమును బడయుచుండ, మనము క్రమముగ సంకుచితభావులము గాజొచ్చితిమి.

వైదిక ఋషులు, త్యాగులు, యోగులు, తాపసులు విలసిల్లిన కాలమున, భారతీయులు పూర్ణాయువులుగ, సర్వసంపదల కాలవాలములుగ, ఆధ్యాత్మిక విజ్ఞానవికాస నిలయములుగ విలసిల్లిరి. ప్రజలందరును తృప్తులై తుష్టి పుష్టి జీవితములను హాయిగ గడపుచుండిరి. జీవితాంత్య దశయందు బ్రహ్మానుభూతిపరులుగ వెలుగొందిరి. ప్రశాంతముగ - సుఖముగ జీవితములను గడపిరి. ఇహపరములను సమన్వయించి, సమీకరించి శాంతిసుఖములను తమ జీవితములందు తాండవింప జేసిరి. దానధర్మములు, దయా దాక్షిణ్యములు, నీతి త్యాగములు వారి జీవితములందు జీర్ణించి, నిత్యాచారములుగ వెలుగొందెను.

తీర్థయాత్రలు, పుణ్యక్షేత్ర సందర్శనములు, వ్రతములు, నోములు, సత్కాలక్షేపములు, వారి నిత్యజీవిత కృత్యములు. ఆటపాటలు, పండుగపబ్బములు, వారి నిత్య చర్యలు. ఇట్లు ఉదారచరితులుగ - దానశీలురుగ, ఆధ్యాత్మిక తత్పరులుగ సరళజీవితమును గడపిరి.

పాశ్చాత్యదేశములందు ముఖ్యముగ జర్మనీదేశమునందలి పండితులు సంస్కృత సారస్వతామృతము నాస్వాదించి, భక్తిశ్రద్ధలతో, ఉత్సాహావేశములతో వేదములను బఠించుచు ఆనందసాగరమున నోలలాడదొడగిరి.

వీరిలో కొందరు ఆర్యుల వేదములను, క్రైస్తవుల బైబిలుతో బోల్చి, తారతమ్యమును గావించి, సెమిటిక్ జాతులకు (హెబ్రూ అరాబిక్) జెందిన బైబిలు తమ నే మాత్రమును సంతృప్తిబరుపజాలక పోయినదనియు, వేదములు మాత్రమే దివ్యజ్యోతి నందించి ఆనందపరవశుల గావించెననియు, నిర్భయముగ, నిరాటంకముగ, నిర్మొగమోటముగ తమ విశాలభావమును వెలువరించిరి. ఇంతియేగాదు. "జర్మనులమగు మేమును ఆర్యసంతతివారమేన"ని సగర్వముగజాటుకొనిరి. జర్మనులు భాషలను నేర్చుకొనుటయందును, వాటిని శీఘ్రముగ నలవరచుకొనుటయందును దక్షత్వముగల కుశాగ్రబుద్ధులు. ఇట్లు బహుభాషాపాఠకులుగ "వేదములభాష ఉన్నత విశిష్టవ్యాకరణయుక్తము, లలితము, మధురము, రసమయము, గానయోగ్యము"అని వేనోళ్ళ కీర్తింపసాగిరి. భారతీయార్యులవలెనే, జర్మనులును ప్రకృతి సౌందర్యమును ప్రశంసించుచు, అద్భుతాశ్చర్యములను రేకెత్తించు విషయాసక్తులుగ వెలుగొందినజాతి. కాబట్టియే వేదములందుట్టిపడు ఆశ్చర్యదృశ్యముల నన్వీక్షించిరి. ఆనాటి భారతీయార్యులు వ్యవసాయమునం దభిలాషను, ప్రేమను ప్రదర్శించిరి. శ్లోకబద్ధ జానపదములను నిత్యము గానమొనర్చిరి. ప్రకృతి సౌందర్యోపాసకులుగ విలసిల్లిరి. ప్రకృతికి దివ్యత్వమును చేకూర్చి కీర్తించుచు సర్వమును

బ్రహ్మమయ మొనర్చిరి. అగ్ని, సూర్యుడు, ఉషాసంధ్యలు, ఆకాశము, పృథ్వి, జలములను భక్తితో నుపాసించెడి వారు. జర్మనులును వీనినే ఆకాంక్షించి, కీర్తించి, ఆరాధింపగడంగిరి. అందులకే రైన్‌నదిని గంగానదిగను, తత్తీరనిర్మిత బాన్ పట్టణమును వారణాసిగను భావించి, తమ నామములను ఆర్యనామములుగ మార్చుకొని, తాము ఆర్యసంతతివారమేనని సగౌరవముగ చాటసాగిరి. ఇట్టి వీరిసంతతికి జెందిన మ్యాక్సుముల్లరు ఉత్సాహావేశములతో వేదముల ననువదించుట యం దాశ్చర్య మేమున్నది ? వేదములను, నైకవిధ సంస్కృతగ్రంథములను ఉత్సాహముతో బఠించుచు, వాటియెడ శ్రద్ధాభక్తులను బ్రబలించుకొనుచుండుటలో వింతయేమి ? ఇదేవిధముగ వీబరు, పిసెల్, హిల్‌బ్రాండ్, ఓల్డెన్‌బర్గు, పాల్ డ్యూసేను మున్నగు ప్రముఖ జర్మనుపండితులు, వేదములను,సంస్కృతసారస్వతమును ఆతురతతో బఠించి, అద్భుతాశ్చర్యములను వెలువరించిరి. ఓల్డెనుబర్గు పండితుడు 'వేదములమతము' అను పవిత్ర గ్రంథమును రచించెను. బెర్గెయిన్ పండితుడు "వేదమతము - ఋగ్వేదమునందలి ఋక్కులు" అను గ్రంథమును ఫ్రెంచిభాషలో విరచించెను.

అగ్నిహోత్రారాధనము, యజ్ఞములు మున్నగువాని నిజతత్త్వాన్వేషణమును గావించు శాస్త్రయుక్త

కృషికి గడంగిరి. తదుపరి బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులు మున్నగు పవిత్రగ్రంథములను బ్రచురించిరి.

వైదికఋషులు, తాపసులు తమ తపోశక్తి ప్రతిభా విశేష విలక్షణముచే భిన్నమార్గముల, అనుభవముల, సాధనములమూలమున బ్రహ్మము ననుభూతికి దెచ్చుకొని, ప్రకటించిరి. వేదములందలి బ్రహ్మమే, ఉపనిషత్తుల యందు ఆత్మగ బేర్కొనబడెను. బ్రహ్మానుభూతి, ఆత్మ ప్రత్యక్షతగ విలసిల్లెను. వేదమునందలి "ఏకమ్సద్విప్రాః బహుధావదన్తి" యను పరమవాక్కు, సర్వం ఖల్విదం బ్రహ్మమను దివ్యవాణి, ఉపనిషత్తులయందు 'తత్త్వమసి'గ వెలుగొందెను. వైదికఋషులు తమ ఉగ్రతపస్సుచే, తపోనుష్ఠాన దీక్షాతత్పరులై బ్రహ్మానుభూతిని బడయ, ఉపనిషత్తులకాలమున శిష్యులు, గురుసేవాతత్పరులై – గురుశిష్య సాంప్రదాయ శిక్షణాఫలితముగ ఆత్మను గాంచ వొడగిరి. బ్రాహ్మణములకాలమున కర్మకాండకు – యజ్ఞ యాగములకు ప్రాధాన్యత నొసంగినను, ఉపనిషత్తుల కాలమున కర్మకాండ కలాపములను వెనుకకునెట్టి, గురుశుశ్రూషకు, విజ్ఞానవికాసతకు ప్రాధాన్యత నొసంగిరి. ఆత్మానుభూతికి జ్ఞానమే రాచబాట యని యుగ్గడించిరి.

ఇట్టి విషయములందు జర్మనులు, ఫ్రెంచివారు తీవ్రముగ కృషినిగావించిరి. తత్ఫలితముగ విట్నీ, బ్లూమ్ఫీల్డు

మున్నగు అమెరికావారు, మ్యాక్డొనెల్, కీత్ మున్నగు ఆంగ్లేయులు, కాలండ్, వీబరు మున్నగుపండితులు సంస్కృతసారస్వతమునం దపారకృషిని గావించిరి. ఇట్లు పాశ్చాత్యులు తమ సర్వశక్తిని, ధనమును ధారబోసి, సంస్కృతవిజ్ఞానమును సముపార్జించుకొని ఉన్నతాభివృద్ధిని బడయుచుండ, భారతీయులమగు మన మేమొనర్చుచుంటిమి ? నవీనవిజ్ఞాన, నాగరికతావేత్తలమని విఱ్ఱవీగు కొందరు భారతీయులు, ఆంగ్లమానసపుత్రులుగ - ఆంగ్లేయులకు దాస్య మొనర్చుచు, వారి ననుకరించుచుండిరి. మన సర్వస్వము నీసడించుచు, పాశ్చాత్యగురువులకు శుశ్రూషలను గావించుచున్నారు. మనకేమియు లేదను మౌఢ్యము వీరి నావరించినది.

ఇక-'సంస్కృతపండితులము, వేదవేదాంగ విద్యాపారంగతులము, ప్రాచీనసాంప్రదాయనిధులము' అని భావించు కొందరు ఛాందసులు, దురహంకారమునకు - మౌఢ్యతకు లోనై, వేదములను తమ సొత్తుగ జేసికొని, వాటిని రహస్యముగనుంచ తమశక్తిని, యుక్తిని వినియోగించుచున్నారు. కుతర్కమును, శుష్కవాదమును లేవనెత్తుచున్నారు. కరడుగట్టిన మౌఢ్యత, అంధవిశ్వాసము వీరిని సంకుచితబుద్ధులుగ గావించుచున్నవి. నిస్తబ్ధత, నిరుత్సాహములకు గురియై, తమ విజ్ఞానమును ప్రకటించుట కియ్యగొనక, మరుగుపడి, కూపస్థ మండూకముల

భ్రాంతిజీవితములను గడపుచున్నారు. నేటికిని యీ సంకు చితభావము, మాంద్యము, నిరుత్సాహము, వేదములు తమ సొత్తేనను దురహంకారము అగ్రజాతులయందు - ముఖ్యముగ బ్రాహ్మణులయందు ప్రబలియుండుట కరము విచారకరము; గర్హ్యము. ఇట్టి మూఢనమ్మకములను, అంధ విశ్వాసములను, సంకుచితభావములను తరలించుట వారి కనీసధర్మము. తమ స్వార్థము నాశించినను, యిట్టి సంకుచితభావము లద్దానిని చేకూర్పజాలవు. పైపెచ్చు వారి శ్రేయమున కివియే గొడ్డలిపెట్టు.

ధనమును పాతిపెట్టిన ప్రయోజన మేమి? దానిని సంఘమున నిత్యధారగ బ్రవహింపజేసినపుడే దానికి విలువ జేగూరును. అథవా! ధనము నితరుల కొసంగిన తనకు తరుగునను భీతియుండుటలో కొంత సత్యమున్న దనుకొనినను, విద్య అట్టిదికాదే! పరులకు బ్రసాదించిన కొలదియు, దాని వికాసత పెంపొంది, విస్తరిల్లును. దాన మొనర్చిన నది తరుగునదిగాదు. దాతను, గ్రహీతను ధన్యులను గావించును. కాబట్టి విద్యా సంపదను విరివిగ ప్రబోధ ప్రచారములకు గుఱిని గావింపవలెను. అట్లు గావింపనినాడు, అది వారియందే మరుగుపడి, క్రుళ్ళి కృశించి, నశించును. ఇట్లు విజ్ఞానమును మరుగుపరచువారు తమ గోతులను తామే త్రవ్వుకొందురు. పాశ్చాత్యులు వేదములను-బ్రహ్మవిజ్ఞానమును బఠించుచుండ మనవారు

కావ్యములు, నాటకములు - తర్కము మున్నగువానితో సరిపెట్టుకొనుచున్నారు. పుక్కిటి పురాణములతో ముడియుచున్నారు.

రామకృష్ణ భండార్కరుగారు సంస్కృత సారస్వతమున కొంతగ పరిశోధనములను గావించెను. కాని యీయన దృష్టి వేదములపై ప్రసరింపకుండుట శోచనీయము. అది మన దురదృష్టము. ఇట్టి విపరీత పరిస్థితులలో, కల్లోలకలుషిత తరంగములమధ్య, ఆర్యావర్త భాను డుదయించెనో యన, శుభోదయ మేతెంచెనో యన ఆర్యావర్త సహజ ప్రభావ భావ సంపత్తిని వెలికిదీసి, సరళభాషలో, మృదుమధురముగ వేదములనిజతత్వమును, యథార్థస్థితిని ప్రకటించు మహాత్ముడు, ఋషిపుంగవుడు అవతరించెను. ఈయనయే దయానంద సరస్వతి. ఈయన అస్ఖలిత బ్రహ్మచారిగ, యోగిగ, విరజానందగురుని కడ శుశ్రూషను గావించి, ఆమూలాగ్రముగ - విస్పష్టముగ వేదముల ప్రతిభను గ్రహించి, భారతదేశమునేగాక సర్వపాశ్చాత్య ప్రపంచమును దిగ్భ్రమము గావించి, ఆర్యావర్త ధృవతారగ వెలుగొందెను. గురుదేవుని యాజ్ఞానుసారము, వెంటనే వేదముల నిజస్వరూపమును వెలువరించి, ప్రచార ప్రబోధములను గావింప గడంగెను. తన గురువున కొసంగిన వాగ్దాన పారితోషికమును నియ్యదియే. ప్రపంచమునందలి ప్రధానమతముల యథార్థతత్వ

వ్యాఖ్యానమును గావించి, వేదములే – సనాతనధర్మమే, వీనికి మూలముగ, విజ్ఞాన దాతలుగ విలసిల్లుటను విస్పష్ట మొనర్చెను. వేదవిజ్ఞానమే ప్రపంచమునకు శాంతి సుఖములను బ్రసాదింపజాలునని యెలుగెత్తి చాటెను. వేదములే నిత్యానంద ప్రదాతలు, బ్రహ్మానుభూతి సంధాయినులని కీర్తించెను. ఆర్యావర్తమునకేగాక సర్వప్రపంచమునకును "వేదము లననేమి? వాని నిజతత్వ మెద్ది?" యను క్లిష్టసమస్యను సలీలగ సంవదించి, పరిష్క రించెను. "సర్వమానవులకును వేదాధ్యయన మత్యావస రము. మానవునకు వివేకవిజ్ఞాన వికాసములను చేకూర్చు వేదములు ఆధ్యాత్మికశక్తికి నిలయములుగ సదా విలసిల్లుచు నున్నవి." అని ఘంటాపథముగ చాటెను.

'సత్యవ్రత సామశ్రామిణ' బిరుదాంకితులగు భట్టా చార్యులు సామవేద శాఖీయులు. స్వతంత్రభావప్రియులు స్వతంత్రాలోచనాపరులు. 'ఉషా' యను పత్రికను సంస్కృ తమున నడపెను. 'నిరుక్తాలోచన' యను సంస్కృత గ్రంథమును రచించెను. వేదములనుగూర్చి కొంతగ కృషిని గావించెను. పాణిని క్రీ. శ. 23 శతాబ్దివాడని యీయన అభిప్రాయము.

బాలగంగాధర తిలకు విజ్ఞాన పిపాసి. సహేతుకవాది. శాస్త్రసమ్మత పరిశోధనాతత్పరులు. 1893 సం.న 'మృగ

శీర్ష' యను గ్రంథమును, 1903 సం.న 'ఆర్యుల ఉత్తర ధృవ నివాసము' అను గ్రంథమును రచించి పాశ్చాత్య లోకమునకు దిగ్భ్రమమును గావించెను. వేదములను గూర్చియు, బ్రాహ్మణములందలి కర్మకాండను గూర్చియు కొంత కృషిని గావించెను. 'మృగశీర్ష' యను గ్రంథమున ఖగోళ, మానవోత్పత్తి శాస్త్రములను గూర్చి విపులముగ చర్చించెను. వేదములు క్రీ. పూ. 45-60 శతాబ్దములకు పూర్వపువేనని భావించెను. 'ఆర్యుల ఉత్తరధృవ నివాసము' అను గ్రంథమున ఆర్యులు ప్రథమమున ఉత్తరధృవ నివాసు లనియు, క్రీ. పూ. 15,000 సం.లకు పూర్వమే యటనివసించిరనియు నిశితవిమర్శనముల ఫలితముగ నిర్ణయములను గావించెను. పాశ్చాత్యు లీ నిర్ణయములను గాంచి చకితులైరి. ఆశ్చర్యమును వెలిబుచ్చిరి. వీరి కృషి ప్రశంసనీయమే. కాని వీరి కొన్ని నిర్ణయములను తదుపరి పరిశోధకులు సహేతుకములు గావని త్రోసివైచిరి. "ఋగ్వేదము భారతీయార్యుల విరచితము" అని ఇరానియనులు తమ గ్రంథములం దుగ్గడించిరి. వేదములు మొహెంజదారా, హారప్పా శిథిలముల కాలమున కతి ప్రాచీనములే యను బెక్కు నిదర్శనములు గలవు. "వేదములు క్రీ. పూ. 10-12 శతాబ్దముల నాటివిగ గన్పించుచున్నను, వాటి భాషలో నీషణ్మాత్రము మార్పును గాంచము." అని లూయీ రీనో పండితుడు భావించెను.

ఇట్లు పాశ్చాత్యులు వేదములను, సంస్కృతభాషా సారస్వతమును గూర్చి నూరు సంవత్సరములకు పైగ నిరంతర కృషిని గావించిరి. పాశ్చాత్య దేశములం దట్లు సంస్కృత విజ్ఞానవ్యాప్తికి కృషిజరుగుచుండ, భారతదేశమున విశ్వబంధుదాసు సంస్కృత శబ్దకోశమును బ్రచురించెను. ఇది ఆంగ్ల, జర్మను భాషలలోని కనువదింపబడెను. వి. యమ్. ఆప్టే పండితులు తన సహచరులతో వేదమంత్రములకు – అందలి అర్చనారాధనములకు గల సంబంధమును గూర్చిన పరిశోధనములను గావించిరి. ధర్మశాస్త్రేతిహాసములను గూర్చి ఆచార్య కానే గారొక గ్రంథమును బ్రకటించెను. పూనాయందలి 'వైదిక సంశోధక మండలి'యు విపులముగ పరిశోధనములను గావించు కృషికి గడంగెను. ఇట్లు వేదములనుండి మహాభారత కాలము వరకును వెలుగొందిన విజ్ఞానమును గూర్చియు, తదుపరి శంకర, రామానుజ, మధ్వాచార్యుల సిద్ధాంత భాష్యములను గూర్చియు, పెక్కు పరిశోధనములు, వ్యాఖ్యలు వెలువడెను. ఈ విధముగ జర్మనులు, వారి ననుసరించిన యితర పాశ్చాత్యులు, వీరి యనుయాయులగు భారతీయులు సంస్కృత సారస్వతమునం దెక్కుడుగ పరిశ్రమమును గావింప సమకట్టిరి.

కాలెండు పండితులు శ్రౌతసూత్రములను జర్మనుభాషలోని కనువదించిరి. బాల్టిమోరు 'అశ్వమేధయాగమును,

గూర్చిన గ్రంథమును ఫ్రెంచిభాషలో ప్రకటించెను. యస్.యమ్. కాత్రే పండితులు ప్రథమ ప్రపంచ మహా సంగ్రామమునకు పూర్వమే తైత్తిరీయ బ్రాహ్మణముపై విస్తారముగ కృషిసల్పి యొక గ్రంథమును రచింప, దీనిని డ్యూమంట్ ఆంగ్లభాషలోని కనువదించెను. ఇట్లు సంస్కృతసారస్వతమునుండి జర్మనీ, ఫ్రెంచి, ఆంగ్ల భాషల యందు బెక్కు అనువాదములు, వ్యాఖ్యలు వెలువడెను.

ప్రపంచమున మతములు పెక్కుగలవు. ఒకేమతము నందునను బెక్కు శాఖోపశాఖలును సాంప్రదాయము లును విరివిగ వెలసిల్లెను. సంస్కృతసారస్వతమునందునను వివిధ శాఖోపశాఖలు అవతరించెను. బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులు, దర్శనములు, నిరుక్త, ఛందస్సు, తర్క వ్యాకరణాది మతసంబంధ గ్రంథములేగాక, భౌతిక, రసాయన, పదార్థ విజ్ఞాన, గణిత, ఖగోళ, భూగో ళాదిశాస్త్రములు, చిత్రలేఖన శిల్పాది కళలు, కావ్యాది గ్రంథములు బెక్కు శాఖలుగ వ్యాప్తమాయెను. ఇంతియేగాదు. పవిత్రవేదములందునను బెక్కు శాఖోప శాఖలు వెలువడెను. యజుర్వేదమునందు ఆపస్తంబ, బౌద్ధాయన, భారద్వాజాదిశాఖలు బయలువెడలెను. ఇట్టి శాఖోపశాఖలుగ విజ్ఞానము విస్తరిల్లుట, వికాసము నకు దోహదమొసగినను, కాలక్రమముగ - దురదృష్ట వశమున, శాఖలు, ఉపశాఖలు, అగ్రపీఠము నలంకరించి,

వేదస్వరూపమును మరుగుపరచసాగెను. ఇట్లు మూలమును విస్మరించి, తమశాఖయే ప్రమాణమనియు, మిగిలినశాఖలు అప్రమాణములనియు, వాదోపవాదములు, వైషమ్య కలుషితప్రబోధములు ప్రబలసాగెను. వేదములుద్ఘోషించు సమీకరణ పారమార్థికతత్వమును, భిన్నత్వమున నేకభగవానుని గీర్తించుటను, దూరమొనర్చి శాఖలకు బ్రాకులాడుచు మూలచ్ఛేదమును గావించి మొదటికే ముప్పును ఘటిల్లజేసిరి. తమతమ సాంప్రదాయములే వేదప్రమాణములు అను సంకుచిత భావములను వెలువరించి వేదముల నిజరూపమును విస్మరింపజేసిరి. సాంప్రదాయములతో సరిపెట్టుకొనుచు అవియే వేదములని ప్రబోధము లొనర్చుచు, వేదమంత్రముల నాధారములుగ, ప్రమాణములుగ స్వీకరించుటను త్యజించిరి. ఇదియే భారతీయుల విషాదగాథ; పతనహేతువు.

ఫిలియోజాట్ వేదమంత్రములందు గల వైద్యవిధానమును గూర్చి కొంత కృషిని గావించెను. "అధర్వవేదమునందు గల ఆయుర్వేదనియమములు శాస్త్రసమ్మతములు; మానవాభివృద్ధిదాయకములు, ఉన్నతపథ సత్యములు" అని యాయన ధృవపరచెను. "చరకశుశ్రుతములు అధర్వవేదమున గల ఆయుర్వేదసిద్ధాంతములకు దుర్బల ప్రతిధ్వనులు" అని ఉద్ఘాటించెను. వ్యాధుల నామములు, లక్షణములు, తన్నిరోధ నివారణోపాయములు, ఓష

ఖులు మున్నగు వానిని గూర్చి విపులముగ వివరించెను. బాహ్యమున సంచరించు వాయువునకును - మానవశరీరమున వ్యాప్తమగుచుండు వాయువునకును గల సంబంధమును విస్పష్టమొనర్చెను. వైద్యమునందలి వైచిత్ర్యములు మున్నగు వానిని వివరించెను. అధర్వవేదమునందుగల పై నియమములను చరకశుశ్రుతలు సంగ్రహించి, విస్పష్టమొనర్చెనని యెలుగెత్తి చాటెను. 'వేదకాలపు సంఘము' అను తన గ్రంథమున యు. యన్. ఘోసాలు గారు ఆ నాటి సంఘనియమములను, ఆచారములను, నీతిని వివరముగ జేర్కొనెను.

బుద్ధభగవానుడు వేదసత్యములనే తన జీవితమునందాచరణమునకు దెచ్చి అనుభూతిని బడసెను. బ్రాహ్మణముల కాలమున, బ్రాహ్మణులచే గావింపబడుచున్న యజ్ఞయాగములను, వాటిని నిర్వహించుట కవలంబించిన జంతుబలులు మున్నగు తతంగములను, వేదసమ్మతములేనని యుద్ఘోషించు బ్రాహ్మణుల పలుకులను విశ్వసించి, యజ్ఞముల నామముతో వారు గావించుచున్న పశుబలులను వేదము సమ్మతించుచున్నదను నపోహకు గుఱియై వేదముల పరమప్రమాణము నామోదింప వెనుకంజవైచినను, ఆయన ప్రబోధించి, ప్రచారమునకుదెచ్చిన బౌద్ధ ధర్మములు, సూత్రములు, వేదములనుండి వెలువడిన సత్యములే యనుట మాత్రము నిస్సంశయము. కాబట్టి బౌద

మతము, వేదములందలి యొక శాఖయే యనుట సత్య దూరము గాజాలదు. బుద్ధుడు తన జీవితమునం దనుష్ఠించి-అనుభూతికి దెచ్చుకొనిన వైదిక సత్యములనే సామాన్య ప్రజలకు — వారి ప్రాంతీయ భాషలలో, ప్రచార ప్రబోధ ములను గావించెను. 'అహింసా పరమోధర్మః' సత్యం వద, ధర్మంచర, భూతానుకంప, మున్నగు ఉన్నత సత్యములు వేదములనుండి యుద్భవిల్లినవే గదా! సిద్ధార్థుని జీవితవికాసమూలము లీ సత్యములేగదా! ఆయన గావించిన దీర్ఘతపస్సు, యోగాచరణములు, తత్ఫలితమగు బుద్ధత్వము వేదప్రబోధ ఫలితములేగదా! వేదము బేర్కొనిన బ్రహ్మస్థితిని - యోగము నిర్వచించిన సమాధ్యవస్థనే బుద్ధుడు నిర్వాణ మని నిర్వచించెను. సనాతన ధర్మమూలసిద్ధాంతములను, వర్ణాశ్రమధర్మ నిజతత్వమును, తదావశ్యకతను బుద్ధు డామోదించెను. కాని జన్మచే వర్ణము లేర్పడినవను వక్రవ్యాఖ్యానమును, వర్ణవ్యవస్థ కపార్థములను గల్పించి, దుర్వినియోగ మొనర్చు సంకుచితవిధానమును మాత్రము తీవ్రముగ గర్హించెను. ఆ నాటి సంఘ దురాచారములను నిశితవిమర్శనమునకు గుఱిని గావించి, ఖండించెను.

పునర్జన్మ సిద్ధాంతమును బుద్ధు డామోదించెను. బుద్ధుడు బేర్కొనిన నిర్వాణమునకు, యోగులసమాధికి దముల బ్రహ్మానుభూతికి నంతగ విభేదము గన్పట్టదు. ఇవి

పర్యాయపదములుగ మాత్రమే విలసిల్లినవి. ఈ కారణ ములచేతనే, తదుపరి హైందవులు బుద్ధుని తత్త్వశాస్త్ర విధానమును త్రోసిపైచినను, వారిని భగవదవతారముగ భావించి ఆరాధించిరి. బుద్ధుడు బ్రహ్మానుభూతినిబడసెను. కాని ఆ బ్రహ్మమును నిర్వచింపజాలక మౌనమును వహించెనేగాని, భగవంతుడు లేడను నాస్తికవాదమును లేవదీయలేదు. బౌద్ధులశూన్యవాదము బ్రహ్మమునొక్క Negative దృక్పథము. బ్రాహ్మణములయందలి - ఉపని షత్తులయందలి సూత్రములే 'ధమ్మసుత్తము'. కాబట్టి బౌద్ధమతము వేదవిరుద్ధముగాదు. అందలి యొక ప్రత్యేక దృక్పథము మాత్రమే. సిల్బరన్‌కన్య (Miss Silburn) బ్రాహ్మణములను - బౌద్ధమత సిద్ధాంతములను సమన్వ యించి - సరియగు వ్యాఖ్యానముతో నొకగ్రంథమును విరచించెను.

పాశ్చాత్య పండితులు గావించిన శాస్త్రసమ్మత పరి శోధక, చారిత్రక నిర్ణయములలో బెక్కు ప్రమాదములు గలవని మేమును అంగీకరింతుము. వారు కొన్నివిషయ ములనుగూర్చి వక్ర వ్యాఖ్యానములను గావించినదియు సత్యమే. కాని, వేదవిజ్ఞాన ప్రచార, ప్రబోధములను సామాన్య ప్రజలయందు విరివిగ, వ్యాప్త మొనర్చు టకు వీరి కృషి యెంతయు దోడ్పడెను. పాశ్చాత్య పండితులు భారతదేశమున కొనర్చిన మహోపకారము,

ఉన్నతసేవ యిందే గలదు. వారు మన కన్నులను విప్పి, మన నావరించిన మైకమును, కొంతవరకు బారద్రోలిరి. మన యమూల్య విజ్ఞానసంపదను - మరుగుపడియున్న మన నిధిని మనకు జూపెట్టిరి; విశాలదృక్పథమునకు దోహద మొసంగిరి. ఏ కొలదిమందియో తమ సొత్తుగ గావించుకొనిన వేదములను జనసామాన్యమున కందించిరి.

వేదవిజ్ఞానమునకు, పాశ్చాత్యపండితులు కొందరు అపార్థములను గల్పించిరని లోగడ చెర్చించితిమి. వీరిలో కొందరు భావించినట్లు వేదములు ఇండో యూరపియనుల గ్రంథములుమాత్రముగావు. పిస్కల్ భావించిన గుప్త రాజుల రాజకీయ సిద్ధాంతములవంటివి, రాజకీయగ్రంథ ములునుగావు. వేదములు నిత్యసత్యములు. బ్రహ్మజ్ఞాన మున కాలవాలములు. అనంతములు. ఇందులకే భార తీయులు 'భగవన్నిశ్వాసములు' 'అపౌరుషేయములు' అని వాటిని కీర్తించిరి.

చూడుడు! తనకు పూర్వము వేదములను గూర్చి పరి శోధనములను గావించిన పండితులు వాటి కపార్థములను గల్పించిరనియు, తాను వేదసత్యములను ఆవిష్కరింప జాలితిననియు బెండా (Benda) యను జర్మనుపండితుడు, ఆవేశపూర్వకముగ, హర్షజన్య ప్రకటనములను గావించు టయే దీనికి ప్రబలనిదర్శనము. ఇట్టి ఆవేశపూరిత, హర్షజన్యానంద ప్రకటనములను గావించిన పాశ్చాత్య

పండితులు పెక్కురు గలరు. షో పెన్‌హోయరు, మ్యాక్సు ముల్లరు, పాల్‌డ్యూసేను మున్నగు మాన్యపండితు లిట్టివారే. ఇంతియేగాదు, వేదములందలి స్వల్పాంశము లను గాంచియే హర్షజన్య ప్రకటనములను గావించిన వారును గలరు. రెగ్నాడ్ సోమరసమును గూర్చియు, బెర్గెయిన్ అగ్నినిగూర్చియు, హెర్టెల్ సూర్యకాంతిని గూర్చియు, రజ్వాడే సంపదనుగూర్చియు గావించిన ప్రకటనము లీతెగకు జెందినవే.

ప్రప్రథమమునుండియును వేదవిజ్ఞానము నెఱుక పరచుకొనుటకు పాశ్చాత్యపండితులు సాయణభాష్య మును ప్రమాణముగ స్వీకరించిరి. కాని తదుపరి పండితులలో కొందరు ప్రాజ్ఞులు తమ యీ ప్రమాదమును గ్రహించుట శుభసూచకము.

అరవిందుడు యోగి, ఋషిపుంగవుడు. "వేదములందు గూఢముగనున్న సత్యములను తాత్త్విక, దార్శనిక విధాన ములచేతనే విదితమొనర్చుకొననగును." అని నుడివెను.

"వేదమునందలి సత్యము, జ్యోతి అను శక్తులకును, అసత్యాంధకారములకును జనించిన యుద్ధగాథ, ప్రతి జీవి యొక్క జీవితగాథయే. వైదికయజ్ఞములు, మాన వుని ఆంతరంగిక త్యాగజీవితమునకు బాహ్యచిహ్నములు మాత్రమే. స్థూలభౌతిక శక్తులనుగూర్చిన గాథలు, మన ఆధ్యాత్మిక గాథల బాహ్యచిహ్నములే. ఈ దృష్టితో

గాంచిన ఋగ్వేదభావములు విస్పష్టము లగును. ఇవి అజ్ఞానుల, భ్రమాలోలుర భావ ప్రకటనములు గావు. మానవజీవిత మధురగీతిక లని సుస్పష్టము. ఇవి ఆత్మానుభూతికి దోహద మొసగు ఆధ్యాత్మిక మధురగానములు."

(అరవిందయోగి).

వేదములనుగూర్చి పెక్కుసంశితులు పలురీతుల వ్యాఖ్యానములను గావించిరి. వేదమంత్రములను విశాల మనస్సుతో, సూక్ష్మదృష్టితో గాంచినచో, వేదములు వేర్వేరను భిన్నమార్గములు - దృక్పథములు - ఏకసత్యమగు బ్రహ్మపథమును జేరుటకు జూపెట్టు రాచబాటలుగ విలసిల్లును. భిన్నత్వమున నేకత్వమును ప్రదర్శించి ఆనందామృతము నందించుటయే వేదముల నిత్య ప్రబోధము. 'బ్రహ్మము సత్యము, నిత్యము' అని వేదములు గానాలాపమును గావించుచున్నవి.

వేదములందలి కవితామాధుర్యమును, గానామృతమును గాంచుడు ? "లేలెమ్ము ! మనలో ప్రాణము పునః ప్రవేశమును గావించుచున్నది. అంధకారము నశించి, వెలుగు మనలను సమీపించుచున్నది. సూర్యగమనార్థము ఉషాకన్య రాచబాటను నిర్మించుచున్నది. మానవులు తమ జీవితములను వర్ధిల్ల జేసికొను తావున కేతెంచితిమి." ఉషోదయ ప్రబోధము (1. 113. 16.).

"ఇదిగో! సూర్యు డుదయించు చున్నాడు (సూర్యోదయ మేతెంచుచున్నది).తమ కిరణకాంతులచే సూర్యుని గాంచిన నక్షత్రములు చోరుల వలె పరుగిడుచున్నవి." (1.50.2.)

"వాయు చలనము ననుసరించి సముద్ర తరంగము లనుగమించుచున్నవి. సభ కేతెంచు కన్యలరీతి ఆ తరంగములు వానికడ కేతెంచుచున్నవి." (X. 168. 2.)

"ఆకాశమునందున్న నక్షత్ర సమూహములు రాత్రి ప్రకాశించుచు, పగలు మరుగుపడి యుండును."

అధర్వవేదమునందు వసుంధరను వర్ణించు మంత్రములు ప్రపంచసారస్వతమునకు శిరోమణులుగ వెలుగొందుచున్నవి.

"ఓ భూమీ! వృక్ష జలములనుండి గంధర్వాప్సరసలు సంగ్రథించిన పరిమళము నీ యందు బ్రసరించినది. దానిచే నన్నును పరిమళవంత మొనర్పుము. ఓ భూమీ! కమలములయందు బ్రసరించు ఆ నీ పరిమళముచే, సూర్యుని వివాహసమయమున అమరులు స్వీకరించిన ఆ నీ పరిమళముచే నన్నును పరిమళవంత మొనర్పుము."

"ఓ భూమీ! స్త్రీ పురుషసౌకుమార్యముతో మానవులయందు, అశ్వాది మృగములయందు కాంతిమంతముగ

కన్యయందు ప్రసరించి ప్రకాశించు వెలుగుచే మమ్ము సమ్మీళిత మొనర్పుము."

హిరణ్యగర్భుని గూర్చిన వర్ణన మెంత సహజము! సుందరము !!

యజుర్వేదమున మనస్సునుగూర్చిన భావగర్భిత వర్ణనములను గాంచుడు!

"తన్మేమనః శివ సంల్పమస్తు."

ఋగ్వేదమునందు వాక్కునుగూర్చిన సహజ వర్ణనమును గాంచుడు !

"ఉతత్వః పశ్యన్ న దదర్శవాచం ఉతత్వః శ్రుణ్వన్ న శ్రుణోతిఏనాం, ఉతోత్వస్మైతన్వం ౧. విసస్రేజాయేవ పత్య ఉశతీ సువాసాః." (ఋ. మం. ౧౦. సూ. ౭౧. మం. ౪.)

విద్వాంసుడు కానివాడు వినుచుండియు వినడు. చూచుచుండియు జూడడు. చెప్పుచుండియు జెప్పడు. విద్వాంసులు కానివారు యీ విద్యావాణిరహస్యమును దెలియజాలరు. సర్వాలంకారములచే హృదయ పూర్వకముగ భార్య భర్తకు దర్శన మొసంగునట్లు, ఒకానొకనికా వాక్కన్య తన సౌందర్యమును జూపెట్టును.

ఇట్టి హృదయానంద మధురభావతరంగ పరంపరలను వేదభాషమూలముననే గాన మొనర్పగలము. వైదిక భాషా భావమాధుర్యతను - తదనువాదము లొసగజాలవనుట సువిదితము.

భాషా సరళతను, భావమాధుర్యతను కవితా రసో ద్దీప్తిని అద్భుతాశ్చర్యావేశముల నుప్పొంగజేయు శక్తిని బ్రదర్శించి, ప్రకటించు సుందరసుకుమార కవితాకన్యను వేదములందు మాత్రమే గాంచజాలుదుము. మరి యే భాషయందునను గాంచజాలము.

ఎట్టి లలితపదజాలము ! ఏమి కళాకౌశలము ! ఎంత శక్తిపటుతాసంపద ! ఎన్ని ఆనందసమ్మిళిత భావతరంగములు ! ఆహా ! అమృతమయము. ఆనందమయము. శాంతి సందీపితము. ఆధ్యాత్మిక వికాసశక్తి ప్రపూరిత ప్రతిభాసంపదకు వేదములే నిలయములు. అన్యభాషల కది గగన కుసుమము. కాబట్టి వేదములకు వేదములే సాటి. కవులకు, కళాకోవిదులకు, శాస్త్రవిజ్ఞానవేత్తలకు చారిత్రక పరిశోధకులకు, దార్శనికులకు, వేదాంతులకు, ఆధ్యాత్మికానుభూతిపరులకు, యిది - యది యననేల ! సర్వ మానవులకును ఆశ్చర్యమును జనింపజేయు అద్భుత పురాతనస్మారకములుగ వేదములు సదా వెలుగొందు చునే యుండును.

# వేద ప్రదీపిక

బౌద్ధుల మతగ్రంథములు త్రిపీటకములు. పారశీక మతగ్రంథము జెండ్ అవెస్తా. క్రైస్తవుల మతగ్రంథములు పురాతన, నూతన టెస్టుమెంటులు – బైబిలు. మహమ్మదీయుల మతగ్రంథము ఖురాను. ఈ గ్రంథములన్నియును మానవోద్భవములు. వాటికి కర్తలు గలరు. ఆ కర్తలు ఉత్తమపురుషులుగ – అవతారమూర్తులుగ వెలుగొందినను మానవజన్మనెత్తినవారే. వీరి మతగ్రంథములు మానవకృతములు; చారిత్రకములు. కాలమునకు కట్టుబడినవి. పై మతగ్రంథకర్తలు మహాత్ములైనను, ఆ గ్రంథము లొక్కొక్క వ్యక్తిపై నాధారపడియున్నవి. మహాత్ములుగాని, ఆప్తులుగాని, అవతారమూర్తులుగాని, ప్రమాదములకు గుఱిగావచ్చును. వారి ప్రబోధము లాయా కాలపరిస్థితుల నిజస్వరూపమును వ్యక్తపరచవచ్చును. కాబట్టి అవి సంస్కరణమునకు గుఱిగాక తప్పదు. అందలి విషయములన్నియు నిత్యసత్యములుగ–సనాతనధర్మముగ – సర్వమానవుల కన్వయించు విశ్వవ్యాప్తనియమములుగ విలసిల్లజాలవు. అట్లు భావించుట ప్రమాదకరము.

వేదము లట్లుగాదు. అవి అపౌరుషేయములు. నిత్యసత్యములు; సనాతనములు. అవి బ్రహ్మమునుండి వెలు

వడినవి. మానవవికాసార్థము, మానవుల కమరత్వము సందించుటకు బ్రహ్మమునుండి వెలువడిన దివ్య వాక్కులు. వీని నావిష్కరించి, అనుభూతి నందుకొనినవారు ఋషులు, తాపసులు, యోగులు, పరమహంసలు, పురుషోత్తములు. ఋషి యన మంత్రద్రష్ట. బ్రహ్మమును సాక్షాత్కరించుకొనిన తాపసి. వేదమునకు ధాత్వర్థము, విద్ - తెలిసికొనుట - అనగా జ్ఞానము. ఈ విజ్ఞానమును వైదికులు 'పర, అపర' అని ద్వివిధముగ విభజించిరి. పర - బ్రహ్మవిజ్ఞానము, అపర - భౌతిక విజ్ఞానము.

ప్రకృతియందలి వికృతి ఫలితముగ వైచిత్ర్యము - భిన్నత్వము వెలువడెను. ఈ భిన్నత్వమునుండి - దీనికి జన్మస్థానము - కేంద్రము అగు ఏకత్వమును - బ్రహ్మమును ప్రత్యక్ష మొనర్చుటయే వేదముల సందేశము. వేదములు జ్ఞాన - కర్మలను సమీకరించును. భోగ, త్యాగములను సమన్వయించి "తేనత్యక్తేన భుంజీథాః" 'త్యాగముచే ప్రపంచమును భోగింపుము' అని ప్రబోధించును. "నిరంతరకృషిని గావించుచు - కర్మాచరణమున నిమగ్నులై ఫలమును త్యజింపుడు" అని ప్రబోధించును. అసంభూతిని (వ్యక్తిపూర్ణత్వమును) సంభూతిని (సమష్టిపూర్ణత్వమును) సమన్వయించును. శ్రద్ధామేథలను సమీకరించి, ఏకత్వము నందించును.

మనోవాక్కాయముల నిజతత్త్వమును విస్పష్టమొనర్చి, వాటి నిజస్వరూపమును వెలికిదీసి, పవిత్రీకరించి, ఏకత్వమునకు గొంపోవును. నిరాకారుడు, నిర్వికల్పుడు, సచ్చిదానందమూర్తి యగు ఏకబ్రహ్మమును బ్రకటించును. సర్వవ్యాపుడు, సర్వవిజ్ఞాని, సర్వశక్తిమంతుడని కీర్తింపబడు బ్రహ్మమును బ్రదర్శించును. "పితామాతా సదామిన్ మానుషాణామ్" మానవులకు దివ్యమాత, దివ్యపిత యని కీర్తించును.

స్వాతంత్ర్యమును, సహోదరత్వమును, సమానావకాశములను విస్పష్టముగ వివరించి, విశ్వమానవ వికాసమునకు – సర్వభూతానుకంపకు దోహదము నొసంగును.

"అజ్యేష్ఠాసో అకనిష్ఠాసో యేతేసమ్ భ్రాతరోబభూవుః (వవృధుః) సౌభగాయమ్" (ఋగ్వేదము 5. 60. 5)

"అధీనః శ్యామశరదశతమ్" (యజుర్వేదము 36.)

"సర్వమానవులు సోదరులే. జన్మచే ఉన్నతావనతులు లేవు. ఈ భావమును మనసునం దిడికొనియే యభివృద్ధిని గాంచగలరు."

"స్వతంత్రులుగ శతవర్షములు జీవింతురుగాక."

సర్వమానవ సోదరత్వమునేగాదు – సర్వభూతములను సమదృష్టితోగాంచి అనుకంపను బ్రదర్శించునవి వేద

ములు. సత్యప్రేమలను బ్రబోధించుచు విశ్వనియమము లను, నిత్యసత్యముల గీర్తించు మంత్రములను - సంహిత లను మానవునకు బ్రసాదించిన దాతలు వేదములు. విశ్వ కళ్యాణార్థము శాంతిని ప్రబోధించు నిర్భయ ప్రకటన ములు వేదములు.

ఇంద్రియములను - మనస్సును - అంతఃకరణమును నిగ్రహించి విశ్వానుగ్రహమును బ్రవహింపజేయఁజాలు మానవుడు ఋషి. ఋషి యన మంత్రద్రష్ట. మంత్ర ద్రష్ట బ్రహ్మమును ప్రత్యక్షముగ గాంచి నిత్యానందమున నోలలాడును. వేదముల సార మిదియే.

ప్రాచీన భారతీయవిజ్ఞానమును బఠించిన పెక్కుగు పాశ్చాత్యులు నిత్యసత్యములను, విశ్వవ్యాప్త నియ మములను, వేదములు ప్రబోధించునని యామోదించి, వాటిని ఆదరాభిమానములతో గీర్తించిరి. చూడుడు !

"హెబ్రూమత గ్రంథములందుగల ఉన్నతభావములను అత్యద్భుతములగు వేదసంహితలు అంతకుపూర్వమే పవిత్రవంతముగ వివరించి యుండెను. ఉత్తమ కవితలో ప్రకృతిని, బ్రహ్మమును బ్రకటించుటయందు వేదకవులు మన కేమాత్రమును దీసిపోరు. ఉన్నతాభి వృద్ధిని సూచించు ప్రాజ్ఞుల ఉత్కృష్ట మతభావముల నిందు గాంతుము. ఆ కవుల (ఋషుల) మానసికవికాస భావ

ప్రకటనములు మన ఉన్నత మతతత్వవేత్తలకును, మిల్టను, షేక్స్పియరు, టెన్నిజను మున్నగు కవుల మానసిక వికాసమునకును మకుటములు."—(డాక్టరు ఆల్ఫ్రెడ్ రసెల్ వాలేసు 'సాంఘిక వాతావరణము, నైతికాభివృద్ధి' యను గ్రంథము నుండి.)

"వేదము లతిప్రాచీనము లనుట నిస్సంశయము. వేదములు తమ కతిప్రాచీనములేనని పురాతన సంస్కృత గ్రంథములును నొక్కివక్కాణించుచున్నవి. మానవాభివృద్ధికి, పరమపద ప్రస్థానమునకు దివ్యజ్యోతులు వేదములు. ఉత్తమ పవిత్రభావములను పవిత్రవంతముగ గీర్తించు ఋగ్వేదమువంటి గ్రంథమును, గ్రీసు, రోముల సారస్వతమున గాంచము" బిషప్ హెరన్.

"ఋగ్వేదము ఆర్యులకేగాక సర్వవిశ్వమునకును అతిపురాతనమని పాతనిబంధనలను పరిశోధించి, వెలువరించిన చరిత్ర విస్పష్టముగ వివరించును. దీనినిబట్టి భారతదేశమున మతభావము ఉన్నతపథమునుండి – అవనతికి – వికాసమునుండి సంకోచమునకు దిగజారెనని తెలియుచున్నది. ప్రాచీన దివ్యానుభూతులే వైదికార్యుల వినిర్మల పవిత్రభావములని నిర్ణయించుట సత్యదూరముగాదు." 'వేదముల ప్రబోధము' – మారిస్ ఫిలిప్సు.

"వేదములందు గుప్తముగనున్న సత్యమును, పురాతన రహస్యములను వెలికి దీయజాలునది దివ్యదృష్టియే.

'అజ్ఞానులు, అనాగరికులు' అని మనము దలంచు వైదికార్యులగు చరిత్రకందని మన పూర్వులు - తిరిగి మనము తెలిసికొను ప్రయత్నములను గావించుచున్న ఆ దివ్యానుభూతులను - ఆ దివ్య వాణిని యెటనుండి బడసిరి?" అని ప్రపంచప్రఖ్యాత తత్త్వవేత్త, నోబులు బహుమతిని బడసిన విజ్ఞానియు నగు మేటర్లింక్ 'వేదముల పవిత్రీకరణము'ను గూర్చి ప్రకటించెను.

"మనము నూతనముగ గనిపెట్టవలసిన దార్శనికములు, తత్త్వసిద్ధాంతము లేమియును లేవు. వైదికార్యుల భావబీజములే యుగయుగములుగ మనకు లభించుచున్నవి. స్కోపెన్‌హోయరు, విట్మన్ మున్నగు తాత్త్వికులకు దర్శనముపై దర్శనమును - మతముపై మతమును బ్రసాదించినవి యీ వైదిక భావాంకురములే. ఈ విశ్వవ్యాప్త నిత్యసత్యములను వివరించి - చూపెట్టుటకు భౌతికశాస్త్ర విజ్ఞాన మొక నూతనరూపమును, ఆశ్చర్యజనితాంబరము (వస్త్రము)ను మాత్ర మొసగజాలినది."—పాశ్చాత్యయోగి **ఎడ్వర్డు కార్పెంటరు 'సృష్టికళ' యను తనగ్రంథమున వివరించిన సుభాషితములు.**

"ప్రేమించుట, ఆలోచించుట, కర్మనొనర్చుటలు దుఃఖస్పర్శను జనింపజేయు చంచలవిభ్రమములు గావు. అవి నిత్యానందమును స్రవించు విశ్వకృషిప్రవాహములు; జ్యోతులకు జ్యోతిగ వెలుగొందు నృత్యచ్ఛాయలు.

అవి యీ జ్యోతిననుగమించు నంధకారముచే గాక నిత్య దృశ్యమగు వెలుగుచే ప్రకృతిద్వారా ప్రకాశించు కాంతి పుంజములు. పూర్ణజీవిత నిత్యసత్యమును ప్రదర్శించు ఆ నిత్యాదర్శమును మానవులు ఆవిష్కరింపగలరు. ద్వంద్వములను, వాటి కారణములను వినిర్మూలన మొనర్చి సత్యసారమును జీర్ణించుకొను అనావృతమే వేదముల యాదర్శము. ద్వేషమును జయింపజాలు తదాదర్శ ప్రేమమీద నిత్య స్వర్గమూర్తులపైన నూతన భూలోకమును సృష్టించుట సంభవము !! అని ఐర్లండు నివాసి, ప్రఖ్యాతకవి, కళాకోవిదుడు, తత్త్వవేత్తయగు డాక్టరు జేమ్సు కజిన్సు 'శాంతిమార్గము' అను తన గ్రంథమున పేర్కొనెను.

"అటనట నేను పఠించిన వేదభావములు ప్రచండ జ్యోతులవలె నాపై ప్రసరించుచున్నవి. పవిత్ర వినిర్మల స్ఫటికములద్వారా సరళమార్గమున ప్రసరింపజేయు విశ్వవ్యాప్త ఋజుత్వమును, భగవంతునిగూర్చిన సత్యములను వేదములు కీర్తించును."

— అమెరికా ప్రఖ్యాతకవి థోరు (Thoreau)

"ఋగ్వేదమునందు వెలుగొందు ఆర్యుల నైతిక నియమములు, ఋక్కులు, ఉన్నత పవిత్రశీలమును ప్రదర్శించునని ధృవపడుచున్నది. అందునను దానధర్మ

ములు, పరోపకారములను గూర్చి వర్ణించు మంత్రము నందలి భావావేశ ప్రకటనములను మరెచటను గాంచ జాలము." — **వేదములనాటి ఆర్యావర్తము. రాగోజిన్**

నిష్పాక్షికముగ వేదములను బఠించు విజ్ఞానులకు, భిన్నత్వమున నేకత్వమును బ్రదర్శించుభావములు సదా ప్రత్యక్షమగుచుండును. భిన్నదృశ్యములందు యేక సత్యమును బ్రదర్శించు ఏకభగవానునకు చిహ్నములుగ ఇంద్ర, అగ్ని, వరుణ, మిత్రాది దేవతలు వర్ణింపబడి, కీర్తింపబడిరి. వేదోపదేశములను గాంచుడు !

'ద్యావా భూమీ జనయన్ దేవఏకః'

(ఋగ్వేదము 10. 81. 3.)

ఒకే భగవంతుడు భూమ్యాకాశములను సృష్టించెను.

'ఏక ఏవ నమస్యో విశ్వాయేభ్యః'

(అదర్వవేదము 2. 1. 1.)

అందరు నమస్కరింపదగినవాడొక్కడే బ్రహ్మము.

'యత్ర సప్తఋషీన్ పరిఏకమాహుః'

(ఋ. 10. 82. 2.)

సప్తఋషులు ఒకే బ్రహ్మముచుట్టునుతిరుగుచున్నారు.

'ఏక ఇద్ రాజా జగతో బభూవ'

(ఋ 1 . 121 . 4 .)

సర్వజగత్తునకును ఒక్కడే ప్రభువు (రాజు.)

"సుపర్ణం విప్రాకవయోవచోభిరేకంసంతం బహుధా కల్పయన్తి" (ఋ. 10. 114. 5.)

ఋషులు, ప్రాజ్ఞులు, ఏకబ్రహ్మమును భిన్ననామము లచే బేర్కొందురు.

తదేవాగ్ని స్తదాదిత్య స్తదువాయు స్తదుచంద్రమాః!
తదేవశుక్రం తద్బ్రహ్మ తా ఆపః సప్రజాపతిః (యజు.32.1.)

అదియే అగ్ని (పూజనీయము). అదియే ఆదిత్యుడు. (అనశ్వరము) అదియే వాయువు (సర్వోపగతుడు). అదియే చంద్రుడు (సుఖదాత). అదియే శుక్రుడు (సృష్టికర్త). అదియే బ్రహ్మ (గొప్పవాడు). అదియే జలము (సర్వవ్యాప్తము). అదియే ప్రజాపతి. (సర్వభూతములకును ప్రభువు).

'ఏకంసద్విప్రాః బహుధావదన్తి' (ఋ. 1. 164. 46.)
ఉన్నదొక్కటియే. ఋషులు భిన్ననామములచే గీర్తించిరి.

'యోదేవానాం నామధా ఏకైవ (ఏకఏవ)'
(ఋ. 10. 82. 3.)

సర్వ దేవతలకును నామములను గల్పించువా డొక్కడే.

బ్రహ్మము ఏకమే. సృష్టికర్తబ్రహ్మ. 'యోవేదేభ్యః అఖిలంజగత్ నిర్మమే; సర్వసృష్టిని వేదముల

నుండియే బ్రహ్మగావించెను. భగవంతుడొక్కడే. ఆయి నను భిన్నవిభిన్ననామరూపములను దాల్చెను.

"సర్వశక్తిమంతుడు, నిత్యుడు, అనంతుడు, స్వయంభూః, సర్వవిజ్ఞాని, సర్వద్రష్ట, బ్రహ్మ, సృష్టిస్థితి లయ కర్త అను నిట్టి పదములచే బ్రహ్మమును వేదములు గీర్తించుచున్నవి." — చార్లస్ కోల్మన్.

"వేదములందలి పవిత్రభావములు ఒకే బ్రహ్మమును గీర్తించునను విశ్వాసమును మనకు చేకూర్చితీరును. ఈ బ్రహ్మము సర్వశక్తిమంతుడు, అనంతుడు, నిత్యుడు, స్వయంభువు, లోకములకు ప్రభువు, అఖండజ్యోతి."
— కౌంటు జోర్నస్ జర్నా.

"ప్రాచీన భారతీయార్యులు బ్రహ్మమును గూర్చిన విస్పష్ట పవిత్రభావమును గలిగియుండిరి." అనుసత్యమును నిరాకరింపజాలము. వారి సర్వరచనములును విస్పష్ట పవిత్రసుకుమార మధుర అగాధ భావములను వెదజల్లు చున్నవి. ఇతర మానవభాషలు భగవంతునిగూర్చి గావించిన ప్రకటనములకివి యేమాత్రమును దీసిపోవు."
— ష్లెజెల్. జర్మనీ ప్రఖ్యాత తత్త్వవేత్త.

పాశ్చాత్యులలో వేదములను నిర్వచించుటలో ప్రామాణికుడుగ దలంపబడిన మ్యాక్సుముల్లరు నుడుల నాలింపుడు.

"ఋగ్వేదసంహితల కాలమేదైనను, లింగభేదములేని ఏక భగవానుని గీర్తించు కాలమునకును, సర్వప్రకృతికి - మనస్సునకు అతీతమైనవాడు గలడని భావించిన కాలమునకును, ఇంద్ర, అగ్ని, యమ, మాతరిస్వాన్ అని కీర్తించిన కాలమునకును, పూర్వము, అని మాత్రము చెప్పక తప్పదు. వేదములు పేర్కొను ఏక బ్రహ్మమును ఋషులు ప్రత్యక్ష మొనర్చుకొని కీర్తించిరి. తదుపరి కాలమున అలెగ్జాండ్రియా క్రైస్తవ తత్వవేత్తలు కొందరు యిట్టిఏకభగవానుని భావమునే బ్రకటించిరి. కాని నేడు క్రైస్తవులమని విర్రవీగుచున్నవారికి మాత్రమిది అందరాని గగనకుసుమముగనే వెలుగొందుచున్నది.

— 'షడ్దర్శనములు' మ్యాక్స్‌ముల్లరు.

"వేదములనుండి జన్మించిన సనాతన ధర్మము - హిందూమతము ఏక భగవానునే కీర్తించును" - కోల్బ్రూక్.

"వేదము ఏకబ్రహ్మమునే కీర్తించును. అది శాస్త్ర సమ్మతమతము. అందు శాస్త్రము, మతము చేతులు గలిపి పనిజేయును. ఇందుగల బ్రహ్మజ్ఞానము, శాస్త్రము, దార్శనికముల పునాదులపై నిర్మింపబడినవి."

— 'వేదమత ఔన్నత్యము' డబ్లియు డి. బ్రౌను.

హైందవుల దృష్టిలో భగవంతు డొక్కడే. దీని నెప్పుడో ఋగ్వేదము "ఏకంసద్విప్రాః బహుధావదన్తి"

అని కీర్తించెను. **ఎర్నెష్టు ఉడ్ విరచిత 'భరతమాతను కీర్తించు ఆంగ్లేయుడు'** అను గ్రంథము.

"ఆశ్చర్యజనితము. మతగ్రంథము లన్నిటికన్న వేద మొక్కటి మాత్రమే నవీనశాస్త్ర నిర్ణయములను ధృవ పరచు భావములచే వెలుగొందుచున్నది. అది సృష్టియందలి క్రమపరిణామమును బేర్కొనుచున్నది." అని 'భారత దేశమున బైబిలు' అనుతన గ్రంథమున జల్లికోట్ బేర్కొనెను.

"మన మందరము ప్రాచీన వైదిక మతమును గూర్చి వింటిమి. పఠించితిమి. భారతదేశము వేదముల భూమి. పరిపూర్ణజీవితమును బ్రకటించు సర్వమతముల భావములనే గాక, నేటికిని భౌతిక శాస్త్రజ్ఞులు నిర్ణయించిన శాస్త్రసత్యములను విస్పష్టముగ వేదములు వివరించును. విద్యుత్తు, రేడియమ్, ఎలెక్ట్రానులు, విమానములు మున్నగు వాటికి సంబంధించిన శాస్త్ర విజ్ఞానమును వేదములనుండియే ఋషులు ఆవిష్కరించిరి." (Mrs. Wheeler Wilcox. American Lady) అని అమెరికా ప్రఖ్యాతవాసిని, వీలరువిల్ కాక్సు సతి నుడివెను.

" 'వేదభావములు పరిపూర్ణ సత్యములు' అని దయానందస్వామి పూర్ణవిశ్వాసము. అంతియేగాదు ! తెలిసికొదగిన విజ్ఞానమంతయు, నవీన భౌతిక శాస్త్రనిర్ణయములన్నియును వేదములందు వెలుగొందుచున్నవని నిర్ణయించి,

యితరులను విశ్వసింపజేయ జాలెను. ఆవిరియంత్రము, విద్యుచ్ఛక్తి, టెలిగ్రఫీ, టెలిఫోను, మార్కొనోగ్రామ్ మున్నగునవి వేదఋషుల కెరుకయేననియు, వాటికి బీజాధారములు వేదములయందు విస్పష్టములనియు ధృవపరచెను" —'జీవిత చారిత్రక వ్యాసములు!' మ్యాక్స్ ముల్లరు.

"హామాన్ ఆలీ రషీద్" అను రాజునకు "ఆస్మాజీ. మాలెవ్, "ఉస్ షా, అరా" అను ఆస్థానపండితు డుండెను. హైందవ పుణ్యక్షేత్రమగు వారణాశియందు వారు మహమ్మదీయుల దండయాత్రల సందర్భమున అమూల్యములగు ప్రాచీన హైందవ గ్రంథములు పెక్కు నిర్మూలములు గాకుండ సంరక్షించిరి. ఇందు కొన్ని గ్రంథములను నేటికిని కెయిరో మ్యూజియమున గాంతుము. విశేష పరిశోధనా ఫలితముగ, వీరు ప్రాచీన హైందవ విజ్ఞాన ప్రబోధకములగు పెక్కువిషయముల "సీరల్ ఉమూల్" అను గ్రంథముగ సంగ్రథించి పాలస్తీనాలోని బీరట్ పట్టణమునందలి "బీరట్ పబ్లిషింగ్ కంపెనీ" వారిచే ప్రకటింపజేసిరి. ఆ గ్రంథమున "లబి బినేఅక్తాబ్ బినే టర్ఫా" అను మహాకవి పద్యమొండుగలదు. ఈ కవి మహమ్మదుకు పూర్వము 2350-2400 సం॥ లోని వాడు; అనగా క్రీ. పూ. 17 వ శతాబ్దివాడు – మ్యాసడోనును బాలించిన అలెగ్జాండరుకు 12 శతాబ్దములు

పూర్వీకుడు. ఈ మ్యాసన్కోన్ పట్టణమునకు ప్రాచీన సూమర్ అకాడ్, ఒకభాగమే. సుమేరియన్ భాషయు లిపియు నాకాలమున అమలులో నుండెను.

"లవి"నామకవి స్వచ్ఛమైన అరేబియా జాతీయుడు. అరబ్ భాషయందు ప్రఖ్యాత రచయిత. వీరి అరాబిక్ భాషాశైలి, మృదుమధురమై - అత్యంత సరళమై - ఆకర్షణీయమై, యొప్పారెడిది. "సీరల్ ఉకుల్" గ్రంథ మున 118 పుటలోగల, వీరు రచించిన సుందర, పవిత్ర పూరిత గేయమును గాంచుడు !.........

"ఓ పవిత్ర హిందూదేశమా ! నీవు ధన్యవు- పూజ నియవు. భగవంతుడు తన వినిర్మలవిజ్ఞానానుభూతిని నియందే ప్రసరింప జేసి, ప్రత్యక్షమొనర్చెను. పరమ పవిత్రమగు ఉద్దీపిత గ్రంథచతుష్టయము మానవ మాన సిక చక్షువులకు విమల - విజ్ఞాన కాంతిపుంజముల ప్రసా దించెను. ఈ గ్రంథములనే, హిందూదేశమున అవతార మూర్తులగు ఋషులచే భగవంతుడు ఆవిష్కరింప జేసెను. ఆయన సమస్త విశ్వమునగల సర్వ మానవజాతికిని "వేదములలో నే నుద్దీపింపజేసిన విజ్ఞానమును మీ జీవితములలో జీర్ణమొనర్చుకొనుడు" అని ప్రబోధించెను.

"భగవత్ప్రకటిత నిధులు సామ యజుర్వేదములు. ఓ సోదరులారా ! వీనిని పవిత్రభావముతో పూజింపుడు.

ముక్తిమార్గ ప్రబోధక సూక్తులివియే. ఋక్-అధర్వణ వేదములు రెండును విశ్వసోదర భావమును రేకెత్తింప జేయును."

సుమేరియనుల కాలమునను అంతకు పూర్వమును వేదముల పవిత్ర భావములు ప్రపంచమున నలుదిశల వ్యాపించి ప్రచారమునందున్నవని మహాకవియగు 'లవి' విరచితమగు పై పద్యము విస్పష్ట మొనర్చుచున్నది.

వేదములను, సంస్కృత సారస్వతమును పాశ్చాత్యులు శ్రద్ధాభక్తులతో పఠించిరి. వేదములనుండి, సంస్కృత సాహిత్యమునుండి సంపాదితమగు సర్వ విజ్ఞానమును తమ దేశముల యభివృద్ధికి విరివిగ వినియోగించుకొనిన విషయోదంతము లిందు వివరింపబడెను. భారతీయుల మగు మనము, యిప్పటికైనను గుప్తముగ నున్న మన యమూల్య సంపదను వెలువరించి, భావిభారత భాగ్యోన్నతికి విరివిగ వినియోగించు కృషికి గడంగుదుముగాక! పశుత్వమునుండి మానవత్వమునకును, మానవత్వము నుండి దివ్యత్వమునకును పయనించు రాచబాటల నిర్మింతుముగాక !!

STATE CENTRAL LIBRARY HYDERABAD, A.P.

భారతీ ప్రెస్, తెనాలి. 1953